తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
06-07-2026
సోమవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 148
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## కాళేశ్వరం వైఫల్యాలపై ముందుగా
# ప్రజలకు క్షమాపణ చెప్పాలి



రూ. 1.20 లక్షల కోట్ల వృధా: బీఆర్ఎస్ వైఫల్యాల వల్లే కాళేశ్వరం ధ్వంసమైంది.

ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే కేటీఆర్ విమర్శించాలి.

నీటి నిల్వ ప్రమాదకరం: మేడిగడ్డలో నీరు ఆపితే దిగువ ప్రాంతాలు మునుగుతాయి.

నిపుణుల సూచనలతోనే పనులు: సేఫ్టీ అథారిటీ (NDSA) నివేదిక మేరకే మరమ్మతులు.

3



## కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్
# గ్లోబల్ ప్రాపగాండా చేస్తోంది

- కాళేశ్వరంపై గ్లోబల్ ప్రాపగాండా చేస్తున్న బీఆర్ఎస్: ఉత్తమ్
- బ్యారేజీల డ్యామేజ్‌తో పంపింగ్ అసాధ్యమన్న మంత్రి
- NDSA నివేదికను విస్మరిస్తున్నారని విమర్శ
- కాగ్ నివేదికతో గత ప్రభుత్వంపై ఘాటు ఆరోపణలు

తెలంగాణ , (సిరి న్యూస్ )

తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాజీ అధికార పార్టీ బీఆర్ఎస్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో విపక్షాలు పూర్తిగా అసత్య ప్రచారం చేస్తూ, గ్లోబల్ ప్రాపగాండాకు తెరలేపాయని మండిపడ్డారు. పదేళ్ల పాటు సాగిన గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్

మిగతా 2వ పేజీలో..



# 2029లో జమిలి ఎలక్షన్స్?

- 2029లో సాధ్యం: 2028 జూలై లోపు బిల్లు వచ్చినా 2029 జమిలి ఎన్నికలు సాధ్యమే.
- ఒత్తిడి లేదు: అన్ని పార్టీల మద్దతు కూడగట్టాకే కేంద్రం ముందడుగు వేస్తుంది.
- ప్రభుత్వం కూలిపోతే: మధ్యలో కూలితే, కేవలం మిగిలిన కాలపరిమితి కోసమే ఎన్నికలు ఉంటాయి
- మూడు విడతలు: 2029 నుండి 2034 వరకు మూడు దశల్లో జమిలి అమలు చేస్తారు.
- తెలంగాణ పొడిగింపు: తెలంగాణ అసెంబ్లీ గడువును 5 నెలలు పొడిగించి 2029 లోక్‌సభతో కలుపుతారు.
- ఆంధ్రప్రదేశ్‌కు ఒకేసారి: ఏపీ ఎన్నికలు ఎలాగూ 2029 లోక్‌సభతో పాటే జరుగుతాయి.
- కొన్ని చోట్ల తగ్గింపు: బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల గడువు తగ్గించి 2034తో కలుపుతారు.
- ముఖ్య లక్ష్యం: నిత్యం ఉండే ఎన్నికల వాతావరణాన్ని తొలగించి, అభివృద్ధిపై పాలన కేంద్రీకరించడం.

भारत निर्वाचन आयोग ELECTION COMMISSION OF INDIA

3



# కష్టపడే వారికి చేయూత అందిస్తా

- సాయం: 91 మందికి రూ. 71 లక్షల విలువైన టీ స్టాళ్ల పంపిణీ.
- చిన్న వ్యాపారులకు శాశ్వత స్టాళ్లు కల్పించి చేయూతనివ్వడం.
- సొంత కాళ్లపై నిలబడి కుటుంబాలను పోషించుకునే భరోసా.
- కష్టపడి, నిజాయితీగా చేసే వ్యాపారమే విజయానికి పునాది.

3



# భయమంటే ఏంటో చూపిస్తాం..

- ఒవైసీ సోదరులకు బండి సంజయ్ వార్నింగ్

3

## చేతకాకపోతే వారం రోజులు కేసీఆర్‌కు అప్పగించండి..
# నీళ్లు ఎత్తి చూపిస్తాం

కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు

కాళేశ్వరం తెలంగాణకు కేసీఆర్ ఇచ్చిన వరమన్న బీఆర్ఎస్

రూ.400 కోట్ల పనులు చేయకుండా రాజకీయం చేస్తున్నారని ఆరోపణ

స్పందించకపోతే 50 వేల మందితో ముట్టడిస్తామని హెచ్చరిక



2



## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను ప్రతిష్టాత్మకంగా చేపట్టండి : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- అర్హత కలిగిన ప్రతి ఓటూ నమోదయ్యేలా చూడాలి
- సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లండి
- సికింద్రాబాద్ కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం

3

## మజ్లిస్ ను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో రేవంత్ ప్రభుత్వం

- రేవంత్ సర్కారుపై కిషన్ రెడ్డి విమర్శలు
- హైడ్రా చర్యల్లో ద్వంద్వ వైఖరి ఆరోపణ
- ఫాతిమా కాలేజీ వ్యవహారంపై ప్రశ్నలు
- 'ఒకే చట్టం.. ఒకే న్యాయం' డిమాండ్



హైదరాబాద్, (సిరి న్యూస్ )

హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సర్కారుకు మజ్లిస్ పార్టీ అంటే భయమా, ప్రేమా లేక రెండూ ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. భూములు, రియల్ ఎస్టేట్ వ్యవహారాల్లో కమీషన్ల కోసం ఆరాటపడుతున్న

మిగతా 2వ పేజీలో..



## ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత

- సత్తుపల్లి నియోజకవర్గంలో రూ. 15 కోట్లతో రోడ్లు, బ్రిడ్జి పనులకు శంకుస్థాపన
- రూ. 2 లక్షల రుణమాఫీతో పాటు ఖాతాల్లో రూ. 6 వేల రైతు భరోసా జమ
- అర్హులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

3

## రాష్ట్రంలో 3.39 లక్షల మెట్రిక్ టన్నుల
# యూరియా నిల్వలున్నాయ్



- రాష్ట్రంలో 3.39 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి
- ఫెర్టిలైజర్ యాప్ ద్వారా 52.86 లక్షల బ్యాగులు కొనుగోలు చేసిన రైతులు
- డిజిటల్ విధానంతో అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు గట్టి అడ్డుకట్ట
- తక్కువ సమయంలో భూసార వివరాల కోసం శాటిలైట్ ఆధారిత మట్టి పరీక్షలు

హైదరాబాద్, (సిరి న్యూస్ )

రాష్ట్రంలో 3.39 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటివరకు 2.52 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు.

మిగతా 2వ పేజీలో..

# కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ గ్లోబల్ ప్రాపగాండా చేస్తోంది

**మొదటిపేజీ తరువాయి**



శాఖను పూర్తిగా సర్వనాశనం చేశారని, వారు ఏది ముట్టినా అది నాశనమైపోయిందని ఆరోపించారు. గత పాలకులు కేవలం తమ కక్కుర్తి కోసమే ప్రాజెక్టులను కట్టారు తప్ప, రైతుల ప్రయోజనాల కోసం కాదని విమర్శించారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ మీద రూ. 1 లక్షా 81 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ, అందులో కాళేశ్వరం తప్ప సాధించిందేమీ లేదని, ఒక్క ఎకరా నిలకడైన నీళ్లు ఇవ్వని కాళేశ్వరం, పాలమూరు, సీతారామ ప్రాజెక్టులే నేడు రాష్ట్రంలో కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు.

బ్యారేజీల డ్యామేజ్ వల్లే పంపింగ్ అసాధ్యం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ఆన్ చేయాలని డిమాండ్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల వైఖరిని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. గత పాలకులు పదేళ్ల పాటు ప్రాజెక్టును సక్రమంగా కట్టి ఉంటే ఈరోజు ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. వారి చారిత్రాత్మక తప్పిదాల వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీలు నేడు ఉపయోగంలో లేకుండా పోయాయని స్పష్టం చేశారు. ఆ బ్యారేజీలలో కనీస స్థాయిలో కూడా నీటిని నిల్వ చేయడానికి వీల్లేదని 'నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ' (NDSA) స్పష్టంగా చెప్పిందని గుర్తుచేశారు. బ్యారేజీల ఫౌండేషన్ అనుమానాస్పదంగా ఉందని, వాటిని వాడొద్దని నిపుణులు నిర్ధారించారన్నారు. ఒకవేళ మేడిగడ్డలో నీళ్లు నిల్వ చేస్తే, ఎగువన భారీ ముంపు ఏర్పడి 44 గ్రామాలతో పాటు భద్రాచలం గుడి కూడా మునిగిపోతుందని కేంద్ర అధికారులు హెచ్చరించారని వెల్లడించారు.

**టెక్నికల్ సమస్యలను వివరిస్తూ ఘాటు విమర్శలు**

ప్రస్తుతం గోదావరిలో నీళ్లు లేవని, వస్తున్న ప్రవాహమంతా ప్రాణహిత నది నుంచే వస్తోందని మంత్రి వివరించారు. ఈ తరుణంలో కన్నెపల్లి పంప్‌హౌస్ ఆన్ చేయాలని మూర్ఖంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణహిత నీళ్ల కోసం కన్నెపల్లి పంపులు ఆన్ చేస్తే.. ఆ నీరంతా అన్నారం బ్యారేజీకి వెళ్తుందని, కానీ అన్నారం బ్యారేజీ ఇప్పటికే తీవ్రంగా డ్యామేజ్ అయి ఉందని పేర్కొన్నారు. అక్కడి నుండి నీళ్లు సుందిల్లకు వెళ్లాలని, కానీ ఆ రెండు బ్యారేజీలూ దెబ్బతిని ఉన్నప్పుడు నీటిని ఎలా నింపుతామని ప్రశ్నించారు. అన్నారం, సుందిల్ల బ్యారేజీలు ఉపయోగంలో లేనప్పుడు కన్నెపల్లి నుంచి ఎత్తిపోసిన నీళ్లు ఎటు వెళ్లాలో సమాధానం చెప్పాలన్నారు. "మీరు ప్రాజెక్టు సరిగ్గా కట్టి ఉంటే, మేము ఎప్పుడో కన్నెపల్లి పంపు ఆన్ చేసేవాళ్లం.. అసలు సమస్యకు కారణమే మీరు" అని దుయ్యబట్టారు.

**కాగ్ నివేదిక.. లీకేజీలపై నిర్లక్ష్యం**

కాళేశ్వరం ప్రాజెక్టు గనుక పూర్తి స్థాయిలో పనిచేస్తే, మొత్తం తెలంగాణ రాష్ట్రానికి ఎంత విద్యుత్ అవసరమో, ఒక్క ఈ ప్రాజెక్టుకే అంత పవర్ అవసరమవుతుందని 'కాగ్' (CAG) నివేదికలోనే స్పష్టమైందని మంత్రి గుర్తుచేశారు. మూడు బ్యారేజీలు కట్టినప్పటి నుండి లీకేజీలు, సివేజ్ సమస్యలు ఉన్నప్పటికీ అప్పటి పెద్దమనుషులు ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. క్షేత్రస్థాయి ఇంజనీర్లు నివేదికలు పంపినప్పటికీ, రాజకీయ ప్రయోజనాల కోసం మేడిగడ్డలో బలవంతంగా నీటి నిల్వను కొనసాగించారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే ఎన్‌డీఎస్‌ఏ (NDSA) బృందం వచ్చి సమీక్ష చేసిందని, టెక్నికల్ అథారిటీ చెప్పిన నివేదికలను కూడా తప్పుపడుతున్న విపక్షాల మూర్ఖపు మాటలకు తాము సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు.

# రాష్ట్రంలో 3.39 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయ్: మంత్రి తుమ్మల

**మొదటిపేజీ తరువాయి**



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యాప్‌కు రైతుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, 17.70 లక్షల మంది రైతులు యాప్ ద్వారా 59.78 లక్షల యూరియా బ్యాగులు బుక్ చేసుకున్నట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే 52.86 లక్షల బ్యాగులను రైతులు కొనుగోలు చేశారు. ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తున్నాయని, పారదర్శకంగా యూరియాను అందించేందుకు రూపొందించిన యాప్‌కు రైతుల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు.

ఎరువుల లభ్యతపై ఎలాంటి సందిగ్ధత లేకుండా ఉండేందుకు వ్యవసాయశాఖ ప్రతి రోజూ జిల్లాల వారీగా యూరియా నిల్వలు, అమ్మకాలు, కొనుగోలు, అందుబాటు తదితర వివరాలతో బులెటిన్లు విడుదల చేస్తోందన్నారు.

ఈ కొత్త విధానం అమలులోకి వచ్చిన తర్వాత అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, ఒకే వ్యక్తి పలుమార్లు యూరియా కొనుగోలు చేయడం, ఎరువులను ఇతర ప్రాంతాలకు మళ్లించడం వంటి అక్రమాలకు గట్టి అడ్డుకట్ట పడిందని తెలిపారు. ఫెర్టిలైజర్ యాప్ అక్రమార్కులకు కొరకరాని కొయ్యగా మారిందన్నారు. ప్రతి యూరియా బ్యాగు కదలికపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తోందని, ఏ డీలర్ దగ్గర ఎంత నిల్వ ఉంది, ఎంత విక్రయమైంది, ఎంత మిగిలి ఉందనే సమాచారం క్షణాల్లో అందుబాటులోకి వస్తోందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన యాప్ ద్వారా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన 68 వేల మంది రైతులు యూరియాను బుక్ చేసుకున్నారని తెలిపారు. వారు 4.69 లక్షల యూరియా బ్యాగులు బుక్ చేసుకోగా 3.38 లక్షల బ్యాగులను కొనుగోలు చేశారని వెల్లడించారు. డిజిటల్ విధానాన్ని రైతులు ఎంత వేగంగా స్వీకరిస్తున్నారో ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయని అన్నారు.

శాటిలైట్ ఆధారిత మట్టి పరీక్షలపై ప్రస్తుతం వ్యవసాయశాఖ విస్తృత స్థాయిలో ప్రయోగాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఉపగ్రహ చిత్రాల ద్వారా లభిస్తున్న సమాచారాన్ని వ్యవసాయశాఖ ప్రయోగశాలల్లో నిర్వహిస్తున్న మట్టి పరీక్షల నివేదికలతో ఎప్పటికప్పుడు సరిపోల్చుతూ ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తున్నామని చెప్పారు. ఈ ప్రక్రియ విజయవంతమైతే రైతులకు తక్కువ సమయంలోనే భూసార వివరాలు, పోషక లోపాలు, అవసరమైన ఎరువులపై అత్యంత శాస్త్రీయమైన సూచనలు అందించగలమన్నారు. వ్యవసాయ రంగంలో మరిన్ని ఐటీ ఆధారిత ఆవిష్కరణలను అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. రైతులకు అవసరమైన అన్ని సేవలను ఒకే వేదికపై అందించే సమగ్ర డిజిటల్ వ్యవస్థలతో పాటు, పంటల పర్యవేక్షణ, భూసార నిర్వహణ, ఎరువుల పంపిణీ, వాతావరణ సమాచార సేవలు, వ్యవసాయ సలహాలను మరింత ఆధునికంగా అందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.




# కుప్పం నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు

**కుప్పం, జూలై 5, (సిరి న్యూస్ ):**

మూడో రోజు పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి N. Chandrababu Naidu సోమవారం కుప్పం నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, రహదారులు, విద్య, వైద్య రంగాల పురోగతిపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. అభివృద్ధి పనుల అమలులో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# మజ్లిస్ ను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో రేవంత్ ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఇందుకోసం సామాన్య ప్రజల జీవనోపాధిని బలిచేస్తోందని ఆరోపించారు. అదే సమయంలో మజ్లిస్ పార్టీ అగ్రనేతల ప్రయోజనాలను కాపాడేందుకు ఈ ప్రభుత్వం ఎంత దూరమైనా వెళ్లేందుకు వెనుకాడటం లేదని మండిపడ్డారు.

**పక్షపాత పాలనకు 'హైడ్రా' ఒక ఉదాహరణ**

రేవంత్ సర్కార్ సాగిస్తున్న సెలక్టివ్ గవర్నెన్స్ (పక్షపాత పాలన)కు హైడ్రా (HYDRAA) చర్యలే ప్రత్యక్ష ఉదాహరణ అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సామాన్య ప్రజల ఇళ్లు, నిర్మాణాల విషయంలో మాత్రం మెరుపు వేగంతో నిర్ణయాలు తీసుకుంటూ, కఠినంగా బుల్డోజర్లతో వ్యవహరిస్తున్న ప్రభుత్వం.. ఒవైసీ కుటుంబానికి చెందిన బారిష్టర్ ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్ విషయంలో మాత్రం మీనమేషాలు లెక్కిస్తోందని దుయ్యబట్టారు. సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (FTL), బఫర్ జోన్‌ను ఆక్రమించి ఈ క్యాంపస్ నిర్మించారనే ఆరోపణలపై తెలంగాణ హైకోర్టు పలుమార్లు జోక్యం చేసుకుని, ప్రభుత్వ జాప్యంపై చీవాట్లు పెట్టినా సర్కారు తీరు మారలేదన్నారు. హైడ్రా, విద్యా శాఖ సహా పలు శాఖల నుంచి కోర్టు వివరాలు కోరినా, సామాన్యులపై చూపించే తొందరపాటును ఫాతిమా కాలేజీ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు.

**కాంగ్రెస్-మజ్లిస్ ముసుగు వీడింది**

కాంగ్రెస్ పార్టీ మజ్లిస్‌ను యావత్ ముస్లిం సమాజానికి ఏకైక ప్రతినిధిగా భావిస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని కిషన్ రెడ్డి విమర్శించారు. హైడ్రా చర్యల వల్ల ఎంతోమంది పేద ముస్లింల ఇళ్లు కూలిపోయి, వారి జీవనోపాధి దెబ్బతిన్నప్పుడు మజ్లిస్ గానీ, కాంగ్రెస్ గానీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని గుర్తుచేశారు. కానీ, ఒవైసీ సోదరుల సొంత ఆస్తుల విషయానికి వచ్చేసరికి మాత్రం ఈ రెండు పార్టీలు ఒకే తాటిపైకి వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముస్లిం సమాజంపై ఎలాంటి ప్రేమ లేదని, కేవలం తమ మిత్రుడైన ఒవైసీకి ఇబ్బంది కలగకూడదనే రేవంత్ సర్కారు తాత్సారం చేస్తోందని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఫాతిమా విద్యాసంస్థల ఉదంతం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని బట్టబయలు చేసిందని, తాము ముస్లింల ప్రతినిధులమని చెప్పుకునే హక్కు ఈ ఇరు పార్టీలకు లేదని తేల్చిచెప్పారు.



**పేదలపై బుల్డోజర్లు.. పెద్దలకు రక్షణలా?**

పేదల ఇళ్లపై బుల్డోజర్లతో విధ్వంసం సృష్టించి, కాంగ్రెస్-మజ్లిస్ రాజకీయ బంధం కోసం పెద్దల ఆస్తులకు నిరంతర రక్షణ కల్పించడమే ఈ ప్రభుత్వ ప్రాధాన్యతగా మారిందని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల భూములు, చెరువులు, ప్రభుత్వ ఆస్తులు అనేవి తెలంగాణ ప్రజల సొత్తే తప్ప, రాజకీయ అండదండలు ఉన్న వారి వ్యక్తిగత ఆస్తులు కావని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇకనైనా మతపరమైన, ఓటు బ్యాంకు రాజకీయాలను మానుకోవాలని.. ప్రజలందరికీ 'ఒకే చట్టం, ఒకే న్యాయం' అనే సూత్రాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఒక్కొక్కరికీ ఒక్కో న్యాయం అమలుచేస్తున్న ప్రభుత్వ తీరుపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని, వీటన్నింటినీ గమనిస్తున్న తెలంగాణ ప్రజలు త్వరలోనే ప్రభుత్వానికి దిమ్మతిరిగే సమాధానం చెబుతారని కిషన్ రెడ్డి హెచ్చరించారు.

# శివంపేట అభివృద్ధికి కృషి చేస్తా

**శివంపేట, (సిరి న్యూస్ ):**

ప్రజా ప్రభుత్వంలో భాగంగా గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు వచ్చే విధంగా కృషి చేయాలని మెదక్ జిల్లా శివంపేట మండలానికి చెందిన సర్పంచులు ముఖ్య నాయకులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను సంగారెడ్డిలో కేంద్రంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ వారితో మాట్లాడుతూ శివంపేట మండల అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను, ప్రజలందరికీ వివరించే బాధ్యత ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులపై ఉందని సూచించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని, మంత్రి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సుధీర్ రెడ్డి, పులిమామిడి నవీన్ గుప్తా, నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పెద్దపట్లూరి మాధవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కమలా పుల్ సింగ్, సర్పంచులు, దొంతిరెడ్డి అరుణ రెడ్డి,కుమ్మరి హైమావతి ఆంజనేయులు, బుర్ర మురళి గౌడ్, కండెగారి ఆంజనేయులు, అయ్యంగారి యాదగిరి,లక్ష్మీ దుర్గ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# చేతకాకపోతే వారం రోజులు కేసీఆర్‌కు అప్పగించండి.. నీళ్లు ఎత్తి చూపిస్తాం

**హైదరాబాద్, (సిరి న్యూస్ )**

కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన హౌస్ అరెస్టులు, పోలీసుల ఆంక్షలు, అడుగడుగునా ఎదురైన అడ్డంకులను అధిగమించి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌కు చేరుకున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఉదయం 8 గంటలకు బయలుదేరిన తమను పోలీసులు అడుగడుగునా అడ్డుకోవడంతో 3 గంటల్లో చేరుకోవాల్సిన ప్రయాణానికి మధ్యాహ్నం 3 గంటల సమయం పట్టిందని మండిపడ్డారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా దగా పడ్డ తెలంగాణకు నీళ్లివ్వాలని కేసీఆర్ మహాయజ్ఞంలా కాళేశ్వరాన్ని నిర్మించారని, తాము ఇక్కడికి ఎవరినో నిందించడానికి లేదా రాజకీయ కక్ష తీర్చుకోవడానికి రాలేదని స్పష్టం చేశారు.

**కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకు వరం**

బాసర నుండి గోదావరి పారుతున్నా సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ఎడారిలానే ఉండిపోయిందని, నీళ్ల కోసమే ఆనాడు ఉద్యమం చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. పల్లం నుంచి నీటిని పైకి తేవచ్చని, మనం కూర్చున్న చోట 90 అడుగుల ఎత్తులో నీళ్లు ఉన్నాయని కాళేశ్వరం నిరూపించిందన్నారు. కాంగ్రెస్ నాయకులు గతంలో తుమ్మిడిహట్టి దగ్గర కడతామని ప్రజలను మభ్యపెట్టారని, ఆనాడు మహారాష్ట్రకు 152 మీటర్ల ఎత్తు పెంచవద్దు అని కాంగ్రెస్ ప్రభుత్వమే లేఖ రాసిందని గుర్తుచేశారు. కానీ, కేసీఆర్ జల దౌత్యం జరిపి, మూడున్నరేళ్లలో చర్యలు తీసుకుని, గోదావరిలో ఎప్పుడూ నీళ్లుండేలా కన్నెపల్లి దగ్గర ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించారన్నారు. 22 ఏళ్లయినా పోలవరం పూర్తికాలేదని, కానీ కాలంతో పోటీ పడుతూ 80 మీటర్ల నుండి 110 మీటర్ల వరకు నీళ్లు ఎత్తేలా ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేశామని చెప్పారు.

**రూ. 400 కోట్ల పనులను చేయకుండా రాజకీయం**

మొత్తం 141 టీఎంసీల సామర్థ్యం, 370 కి పైగా పిల్లర్లు ఉన్న ఈ భారీ ప్రాజెక్టులో ఒక బ్లాక్‌లో రెండు పిల్లర్లు కుంగితే 'కూలేశ్వరం' అంటూ కాంగ్రెస్ నేతలు కుట్రపూరిత ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు పిల్లర్లు కుంగిన ఘటనపై తమకు కూడా అనుమానాలు ఉన్నాయన్నారు. రెండు పిల్లర్లు కుంగిన బ్లాక్ పునర్నిర్మాణానికి కేవలం రూ. 400 కోట్లు మాత్రమే అవుతుందని, అది కూడా ప్రభుత్వంపై ఒక్క పైసా భారం పడకుండా నిర్మాణ సంస్థ పూర్తి చేస్తానని చెప్పినా ప్రభుత్వం పనులు చేయడం లేదని ఆరోపించారు. రూ. 95 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల కుంభకోణం ఎలా జరుగుతుందని రేవంత్ రెడ్డి సొంత మామనే ప్రశ్నించినా, ముఖ్యమంత్రికి బుద్ధి రావడం లేదని ఎద్దేవా చేశారు.



**చేతకాకపోతే కేసీఆర్‌కు అప్పగించండి.. లేదంటే ముట్టడిస్తాం!**

ప్రస్తుతం కాళేశ్వరం దగ్గర 100 మీటర్ల ఎత్తులో నీళ్లు ఉన్నాయని, కన్నెపల్లి నుండి నీళ్లు తీసుకోవడానికి 93 మీటర్లు ఉంటే చాలని, అయినా ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయడం లేదని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం నీళ్లు తీసుకోకపోవడం వల్లే హైదరాబాద్‌లో తాగునీటి కొరత ఏర్పడి 15 వేల ట్యాంకర్లు తిరుగుతున్నాయన్నారు. కాళేశ్వరం లేకుండానే రికార్డు స్థాయిలో పంటలు పండాయని అంటున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, 2014కు ముందు ఎందుకు ఇంత ధాన్యం పండలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఎల్‌బీసీ (SLBC) టన్నెల్ కూలినప్పుడు మీ అవినీతి వల్లే కూలిందని తాము అనలేదా అని ప్రశ్నించారు. రైతులకు నీళ్లిస్తే యూరియా ఇవ్వాలని, ధాన్యం కొని మద్దతు ధర ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయడం లేదన్నారు.

"కాళేశ్వరం ఈ రాష్ట్రానికి కేసీఆర్ ఇచ్చిన వరం.. నీవు (ఉత్తమ్) శనేశ్వరం" అని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మీకు చేతకాకపోతే మా కేసీఆర్‌కు ఒక్క వారం రోజులు అప్పగించండి.. వారం రోజుల్లో నీళ్లు ఎత్తి చూపిస్తాం" అని సవాల్ విసిరారు. మేడిగడ్డ కాకుండా కన్నెపల్లి నుండి నీళ్లు తీసుకునే అవకాశం ఉన్నా ఎందుకు తీసుకోవడం లేదో చెప్పాలని, ఎన్‌డీఎస్‌ఏ (NDSA) రిపోర్టులకు ఎలాంటి విశ్వసనీయత లేదని కొట్టిపారేశారు. ప్రభుత్వంపై కలిసికట్టుగా ఒత్తిడి తెచ్చి నీళ్లు ఎత్తేలా చేస్తామని, అప్పటికీ స్పందించకపోతే 50 వేల మందితో ప్రాజెక్టును ముట్టడించి, తామే స్వయంగా మోటర్లను ప్రారంభిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

# 2029లో జమిలి ఎలక్షన్స్?



తెలంగాణ బ్యూరో, (సిరి న్యూస్ )

ఈ నెల మొదలవుతున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో జమిలి ఎన్నికల బిల్లును ప్రవేశపెట్టే అవకాశం లేదని వన్ నేషనల్ వన్ ఎలక్షన్ బిల్లు అధ్యయనం చేస్తున్న జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) చైర్మన్, బీజేపీ ఎంపీ పీపీ చౌదరి తెలిపారు. ఈ సారికి బిల్లు ప్రవేశపెట్టకున్నా.. ఆ మాటకొస్తే 2028 జులైలోపు బిల్లు వచ్చినా సరే 2029 జనరల్ ఎన్నికలు జమిలిగా నిర్వహించడం సాధ్యమేనని వివరించారు. అయితే, కొన్ని రాష్ట్రాల గడువులు తగ్గించాల్సి రావొచ్చని, అలా చేసినా జమిలి ఎన్నికలు దేశానికి ప్రయోజనమే చేకూరుస్తుందన్నారు. ఆగమేఘాల మీద బిల్లుపై రిపోర్ట్ సమర్పించాల్సిన ఒత్తిడి తమపై లేదని, అన్నివర్గాల మద్దతు కూడగట్టి ఈ విషయంలో సమిష్టిగానే ముందడుగు వేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిపారు. కేవలం ప్రధాని నరేంద్ర మోడీ ఈ అంశాన్ని లేవనెత్తారు కాబట్టి వ్యతిరేకించడానికి బదులు దేశానికి ప్రయోజనం చేకూరుస్తుందన్న విషయాన్ని గుర్తించాలని వివరించారు. కొన్ని రాజకీయ పార్టీలకు మినహా అంతటా ఈ ప్రతిపాదనలకు ఆమోదమే లభిస్తున్నదన్నారు. లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాలు, యూటీల అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో నిర్వహించాలని, లేదా నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయడమే ఈ జమిలి ఎన్నికల ప్రతిపాదన. ఈ ఎన్నికలు నిర్వహించిన 100 రోజుల్లో స్థానిక ఎన్నికలు పూర్తి చేసి దేశంలో నిత్యం ఎన్నికల వాతావరణాన్ని తొలగించి అభివృద్ధిపై పాలనను కేంద్రీకరించే లక్ష్యంతో ఈ బిల్లును తెచ్చినట్టు చౌదరి వివరించారు.

**మధ్యలోనే ప్రభుత్వం కూలిపోతే?**

జమిలి ఎన్నికలపై జేపీసీ విస్తృతంగా సంప్రదింపులు జరుపుతున్నది. మాజీ సీజేల దగ్గర నుంచి న్యాయనిపుణుల వరకు, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డిప్యూటీ సీఎంలు, కార్యదర్శులు సహా పలువురి అభిప్రాయాలు స్వీకరిస్తున్నది. దేశంలో జమిలిగానే ఎన్నికలు మొదలయ్యాయని, 1952 నుంచి 1967 వరకు లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగేవని పీపీ చౌదరి గుర్తు చేశారు. 20 ఏళ్లపాటు జమిలిగా ఎన్నికలు జరిగాయని, ఆ ఎన్నికలు బ్యాలెట్ పేపర్‌లతో నిర్వహించారనీ వివరించారు. లోక్‌సభకు ఎవరిని పంపాలి? అసెంబ్లీకి ఎవరిని పంపాలనేది ఓటర్లకు తెలుసని, కాబట్టి, ప్రాంతీయ పార్టీలకు, రాష్ట్రస్థాయి రాజకీయాలకు జమిలి పెద్ద దెబ్బ అనే ఆరోపణలు అనవసరమైనవని అభిప్రాయపడ్డారు. 20 ఏళ్ల తర్వాత ప్రభుత్వాలు కూలిపోవడంతో జమిలి చెదిరిపోయిందని, ఇకపైనా అలాగే అవిశ్వాస తీర్మానం నెగ్గి ప్రభుత్వం కూలిపోతే పరిస్థితి ఏమిటనే విషయంపై మేధోమథనం జరుగుతున్నది. ఒకవేళ అలా ప్రభుత్వం కూలినప్పుడు ఆ ఐదేళ్లలో మిగిలిన టర్మ్ కోసం మాత్రమే ఎన్నికలు నిర్వహించాలనే అంశంపై ఆలోచన చేస్తున్నామని మే నెలలో పీపీ చౌదరి వెల్లడించారు. 1993లో చేసిన రాజ్యాంగ సవరణ.. స్థానిక స్వయంపాలక సంస్థల్లో అవిశ్వాసం నెగ్గినప్పుడు మిగిలిన టర్మ్ బాధ్యతలను కొత్త చైర్మన్, కొత్త కమిటీ తీసుకునే అవకాశాన్ని తెచ్చిందని వివరించారు. క్షేత్రస్థాయిలో ఉన్న ఈ సూత్రాన్నే అసెంబ్లీ, పార్లమెంటుకు కూడా విస్తరించవచ్చునని తెలిపారు.

**గతంలో అసెంబ్లీలను రద్దు చేసిన దాఖలాలు**

జమిలి ఎన్నికల కోసం లోక్‌సభతోపాటు రాష్ట్రాల ఎన్నికలు నిర్వహించాలి. ఇందుకు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలను పొడిగించాల్సి ఉండగా, మరికొన్నింటిని ముందస్తుగానే రద్దు చేయాల్సి ఉంటుంది. అయితే, ఇది దేశవ్యాప్తంగా చాలా రకాల ఆందోళనలు, ఆరోపణలు రేపే చాన్స్ ఉన్నది. అందుకే పార్టీపై ప్రతికూల అభిప్రాయాలు ఏర్పడకుండా జాగ్రత్తగా, మెజార్టీవర్గాల సమ్మతితో ముందుకుసాగాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. అయితే, ఇలా అసెంబ్లీ గడువుల మార్పు తప్పదని జేపీసీ చైర్మన్ చౌదరి స్పష్టం చేశారు. 196768లోనూ లోక్‌సభతో పాటుగా ఎన్నికలు నిర్వహించడానికి 57 రాష్ట్రాల అసెంబ్లీలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తుగా రద్దు చేసిందని వివరించారు. ఇలా రద్దు చేయడం తప్పేమీ కాదన్నారు.

**మూడు విడతల్లో జమిలి అమలు?**

2029లో జమిలి ఎన్నికలు నిర్వహించాలనే సంకేతాలను ఒకవైపు వస్తున్నా.. మరోవైపు ఇందుకోసం కఠినమైన నిర్ణయాలు తీసుకోవడానికి బదులుగా 2029 నుంచి 2034 వరకు విడతల వారీగా జమిలి ఎన్నికలకు మార్గం సుగమం చేసుకోవాలనే ఆలోచనలూ జేపీసీ వద్ద ఉన్నట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగా మూడు విడతల్లో లోక్‌సభతో రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను జోడించాలనే ప్రతిపాదనలున్నట్టు సమాచారం. దీని ప్రకారం, 2028లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ, మిజోరం, కర్ణాటక, తెలంగాణ అసెంబ్లీ గడువు మరో ఐదారు నెలలు పొడిగించాల్సి ఉంటుంది. అంటే, తెలంగాణ అసెంబ్లీని మరో ఐదారు నెలలు పొడిగిస్తే 2029 లోక్‌సభ ఎన్నికలతో కలిపి నిర్వహించవచ్చు. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం, హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్ము కశ్మీర్‌ల ఎన్నికలు 2029లో లోక్‌సభతోపాటే (చివరి నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ గడువులను మూడు నెలలు తగ్గించాలి) జరుగుతాయి. ఇక మూడో విడతలో భాగంగా 2030, 2031లో జరిగే అస్సాం, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, ఢిల్లీ, బిహార్ రాష్ట్రాల అసెంబ్లీలను ఒకటి లేదా రెండేళ్లు తగ్గించి 2034 లోక్‌సభ ఎన్నికలతోపాటు నిర్వహించాలి. ఫలితంగా 2034 నుంచి జమిలి ఎన్నికలు సంపూర్ణంగా అమల్లోకి వస్తాయి.



## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను ప్రతిష్టాత్మకంగా చేపట్టండి : డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, (సిరి న్యూస్ )

రాబోయే ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)ను క్షేత్రస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజాభవన్ లో ఆదివారం జరిగిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల కీలక సమావేశానికి హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ఓటరు జాబితాలో అన్‌మ్యాపింగ్ పేర్లు, సాంకేతిక లోపాలు, స్పెల్లింగ్ తప్పులు లేకుండా బి.ఎల్.ఏలతో కలిసి డివిజన్ స్థాయి నాయకులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా మినహాయింపు కాకుండా పకడ్బందీగా వ్యవహరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ సాయం, నేరుగా విద్యార్థుల ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ, ఇందిరమ్మ జీవిత బీమా వంటి పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రచారం చేయాలన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 40వేల కోట్లతో చేపడుతున్న రోడ్లు, ఫ్లై ఓవర్ల నిర్మాణాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. గత పదేళ్ల భయానక వాతావరణాన్ని తొలగించి, ఫోన్ ట్యాపింగ్ భయం లేని స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య పాలనను అందిస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. పార్టీ గెలుపు బూత్ స్థాయి నుంచే మొదలవ్వాలని, ప్రజల చిన్న చిన్న సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో అన్‌మ్యాపింగ్ పేర్లు 50 శాతానికి పైగా ఉండటం ఆందోళనకరమని, లాజికల్ డిస్క్రిపెన్సీ వల్ల పేర్లు తొలగిపోకుండా సకాలంలో బి.ఎల్.ఓలకు ధృవీకరణ పత్రాలు అందించి సమన్వయం చేసుకోవాలని సూచించారు. నగరంలో జరుగుతున్న ఉపాధి, అభివృద్ధి ప్రణాళికలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్ ఫహీం ఖురేషి, నేతలు కోట నీలిమ, ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

## కష్టపడే వారికి చేయూత అందిస్తా

హైదరాబాద్, (సిరి న్యూస్ )

కష్టపడి పని చేసుకునే వారికి ఎల్లప్పుడూ నా సంపూర్ణ సహకారం, ప్రోత్సాహం ఉంటుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో హోటల్ నడుపు కొంటూ ఉపాధి పొందుతున్న వారికి నెక్ సహకారంతో ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు రూ.71 లక్షల విలువ గల 91 టీ స్టాల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మీ కష్టానికి నా వంతుగా ఉడుతా భక్తి గా ఈ స్టాల్స్ అందిస్తున్నట్లు చెప్పారు. కొంతమంది బండి మీద మీరు హోటల్ పెట్టుకొని.. కొంతమంది రోడ్డు మీద పెట్టుకొని ఉండే వాళ్లకు స్థాల్ ఉండాలనే ఉద్దేశ్యంతో సహకారం ఇస్తున్నట్లు చెప్పారు. కష్టపడే వారికి చేయూత.. ప్రోత్సాహం అందించే విషయంలో నా సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. టీ స్టాల్ వ్యాపారమే కాదు.. మీ కాళ్ల మీద మీరు నిలబడి మీ కుటుంబానికి జీవన దారమని చెప్పారు. కష్టపడి పని చేసే వారికి ఆత్మవిశ్వాసాన్ని పెంచే మార్గమని, నిజాయితీ గా చేసే వ్యాపారం విజయానికి పునాది అవుతుందన్నారు. వ్యాపారం మరింత వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. టి స్టాల్స్ తో సామాగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## కాళేశ్వరం వైఫల్యాలపై ముందుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలి: మంత్రి శ్రీధర్ బాబు

- **రూ. 1.20 లక్షల కోట్ల వృథా: బీఆర్ఎస్ వైఫల్యాల వల్లే కాళేశ్వరం ధ్వంసమైంది.**
- **ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే కేటీఆర్ విమర్శించాలి.**
- **నీటి నిల్వ ప్రమాదకరం: మేడిగడ్డలో నీరు ఆపితే దిగువ ప్రాంతాలు మునుగుతాయి.**
- **నిపుణుల సూచనలతోనే పనులు: సేఫ్టీ అథారిటీ (NDSA) నివేదిక మేరకే మరమ్మతులు.**



భూపాలపల్లి , (సిరి న్యూస్ ):

బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ.1.20 లక్షల కోట్ల ప్రజాధనాన్ని నీటిపాలు చేసిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు. ఆదివారం సాయంత్రం భూపాలపల్లి శాసనసభ్యుడి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులే ఇంజినీర్లుగా వ్యవహరిస్తూ ప్రాజెక్టుల నిర్మాణంలో జోక్యం చేసుకున్నందువల్లే నేడు ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం జాతీయ స్థాయి సాంకేతిక నిపుణులు, ఇంజినీర్ల సలహాలు, సూచనల మేరకే కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు చేపట్టి రైతులకు నీరందించే చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజ్‌ను సందర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం సరికాదని మంత్రి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన లోపాలకు ముందుగా ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే విమర్శలు చేసే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు ఉంటుందని స్పష్టం చేశారు.

రూ.1.20 లక్షల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో తీవ్ర సాంకేతిక లోపాలు బయటపడినప్పటికీ, వాటిపై బాధ్యత వహించకుండా బీఆర్ఎస్ నాయకులు రాజకీయ విమర్శలకు దిగడం విచారకరమని పేర్కొన్నారు. ప్రజల డబ్బుతో నిర్మించిన ప్రాజెక్టు ఈ దుస్థితికి చేరడానికి కారణమైన వారే ఇప్పుడు ప్రజలకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో కాంక్రీట్ బ్లాకులు దెబ్బతినడం, పైపింగ్, లీకేజీలు, నిర్మాణ లోపాలపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) స్పష్టమైన నివేదిక ఇచ్చిందని తెలిపారు. ఆ నివేదికల ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం మరమ్మతులు, పునరుద్ధరణ చర్యలు చేపడుతోందని చెప్పారు. మేడిగడ్డ వద్ద నీటిని నిల్వ చేయడం వల్ల బ్యారేజ్ భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరించారని మంత్రి వెల్లడించారు. అలాంటి పరిస్థితుల్లో నీటిని నిల్వ చేయకుండా ఉండటం ప్రభుత్వ బాధ్యతేనని అన్నారు. ఒకవేళ నీటిని నిల్వ చేస్తే దిగువ ప్రాంతాలైన ములుగు, ఏటూరునాగారం, భద్రాచలం ప్రాంతాలకు కూడా ప్రమాదం ఏర్పడే అవకాశముందని నిపుణుల నివేదికలు పేర్కొన్నాయని వివరించారు.

జూలై 14, 2025న కన్నెపల్లి పంప్‌హౌస్ మునిగిపోయిందని, సుమారు రూ.680 కోట్ల విలువైన పంపులు, మరో రూ.150 కోట్ల విలువైన పరికరాలు నీటమునిగాయని మంత్రి గుర్తుచేశారు. అన్నారం పంప్‌హౌస్ కూడా నీటమునిగిందని, ఇవన్నీ ప్రాజెక్టు రూపకల్పనలో జరిగిన లోపాలకు నిదర్శనమని పేర్కొన్నారు. మేడిగడ్డ వద్ద నీటి నిల్వలు లేకపోయినా పంపులను ఆన్ చేయవచ్చని కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని మంత్రి అన్నారు. ఇంజినీర్లకంటే తమకే ఎక్కువ సాంకేతిక పరిజ్ఞానం ఉన్నట్లు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం హాస్యాస్పదమని విమర్శించారు. ప్రభుత్వం ఎలాంటి రాజకీయ ఉద్దేశంతో కాకుండా నిపుణుల నివేదికలు, డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకే చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నమే బీఆర్ఎస్ చేస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన తప్పిదాలకు సమాధానం చెప్పాల్సింది బీఆర్ఎస్ నాయకత్వమేనని, వాస్తవాలను ప్రజలకు వివరించి క్షమాపణ చెప్పిన తర్వాతే విమర్శలు చేసే నైతిక హక్కు వారికి ఉంటుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

## భయమంటే ఏంటో చూపిస్తాం..

- **ఒవైసీ సోదరులకు బండి సంజయ్ వార్నింగ్**

హైదరాబాద్, (సిరి న్యూస్ )

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆ పార్టీ తీరుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న రాజకీయ అండతోనే ఒవైసీ బరితెగించి మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. చివరికి న్యాయస్థానాలను కూడా గౌరవించకుండా, హైకోర్టునే బెదిరించేలా ఒవైసీ వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అడ్డగోలుగా తప్పులు చేస్తూ మళ్లీ హైకోర్టునే ప్రశ్నిస్తారా? అంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎం నేతలకు కోర్టులు అన్నా, చట్టాలు అన్నా అస్సలు గౌరవం లేదని ధ్వజమెత్తారు. చెరువులను ఆక్రమించుకుని విద్యాసంస్థలను నిర్మించడమే ఒక పెద్ద తప్పని, దీనిపై హైకోర్టు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఒవైసీ ఎందుకు జాప్యం చేస్తున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ఫాతిమా విద్యా సంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నోరెదపడం లేదని ఆయన నిలదీశారు.

**బీజేపీ వస్తే కూల్చివేతలు ఖాయం..**

గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న విద్యా సంస్థలకు కూల్చివేస్తామంటూ నోటీసుల మీద నోటీసులు ఇస్తున్న ప్రభుత్వం.. ఒవైసీ ఆధ్వర్యంలోని ఫాతిమా విద్యా సంస్థల జోలికి ఎందుకు వెళ్లడం లేదు? ఒవైసీకి ఒక న్యాయం.. ఇతరులకు ఇంకో న్యాయమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఒవైసీ నేతృత్వంలోని సదరు విద్యా సంస్థ గతంలో మిలిటెంట్లకు షెల్టర్ ఇచ్చింది నిజం కాదా? అని బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. అక్కడ విద్యార్థులకు చదువు చెప్పే ముసుగులో మిలిటెంట్లను తయారు చేస్తున్నారా? అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేపు బీజేపీ అధికారంలోకి రాగానే అక్రమంగా కట్టిన ఫాతిమా విద్యా సంస్థలను కూల్చివేస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## ప్రజా ప్రభుత్వంలో సంక్షేమం - అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత

సత్తుపల్లి/కల్లూరు , (సిరి న్యూస్ ):

ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లలలోనె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమ ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదివారం సత్తుపల్లి నియోజకవర్గంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ముందుగా కల్లూరు మండలం చిన్నకోరుకొండ గ్రామంలో రూ.5. కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం చేపడుతున్న చిన్నకోరుకొండి కిష్టారం వైరా నెమలి రహదారులు మధ్య ఉన్న లింక్ రోడ్ కు, తర్వాత రూ. 6కోట్ల 30లక్షల వ్యయంతో లోకవరం పెనుబల్లి రహదారి పై హైలెవల్ బ్రిడ్జి పనులకు ఆనతరం నగరాభివృద్ధి లో భాగంగా కల్లూరు ప్రధాన రహదారి లో రూ.93 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు, అలాగే తిరువూరు ఎక్స్ రోడ్ కల్లూరు జంక్షన్ వద్ద రూ.8కోట్ల 60 లక్షల అంచనా వ్యయంతో ఖమ్మం నుండి అశ్వరావు పేట జాతీయ రహదారి జంక్షన్ అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి మంత్రి శంకుస్థాపనలు చేశారు.



ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజల విశ్వాసంతో ఏర్పడిన ఈ ప్రభుత్వం పేదల సంక్షేమం, మహిళల సాధికారత, రైతుల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తోందన్నారు. ప్రజలు అందించిన ఆశీస్సులు, దీవెనల వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాత్రమే కాకుండా, చెప్పని అనేక సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రజల ఇంటి ముంగిటకు తీసుకెళ్తోందని మంత్రి తెలిపారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా పాలన కొనసాగుతోందన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి అర్హత కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, గతంలో పేదలకు అందని సన్న బియ్యాన్ని ఇప్పుడు రేషన్ ద్వారా పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వని పరిస్థితిని మార్చి అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. పేదల చిరకాల స్వప్నమైన సొంత ఇంటిని సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి సుమారు 3,500 ఇళ్లు, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరు చేశామని, అనంతరం కూడా దశలవారీగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు అందజేస్తామని స్పష్టం చేశారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ, రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ అమలు చేశామని తెలిపారు. రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతుల ఖాతాల్లో తొలి విడతగా రూ.6 వేల చొప్పున టిగ్..టిగ్ అనె మెసేజ్ ద్వారా జమ అవుతున్నాయని, రెండు మూడు రోజుల్లో పూర్తిగా అందరికీ జమ అవుతాయని వెల్లడించారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, సన్న ధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాల్‌కు రూ.500 ప్రోత్సాహకం అందిస్తున్నామని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

తాను కల్లూరు మండలంలో పుట్టి పెరిగిన వ్యక్తినని, పాలేరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ సత్తుపల్లి నియోజకవర్గం కూడా తన సొంత ప్రాంతమేనని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తానని, ఇప్పటికే సుమారు రూ.15 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ రూ.15 కోట్ల పనులతోనే అభివృద్ధి ఆగిపోదని, కొత్త మున్సిపాలిటీ అవసరాలను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో మరిన్ని నిధులు కేటాయించి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.పేదల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## రైతు భరోసా నిధుల జమపై హర్షం..

- **పటాన్‌చెరులో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం**

**పటాన్‌చెరు, జూలై 5 (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 73 లక్షల మంది రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.6 వేల చొప్పున సుమారు రూ.9 వేల కోట్లను జమ చేయడంతో ఆదివారం పటాన్‌చెరులో కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కూరి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో రైతులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్కూరి నరసింహారెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతు రుణమాఫీతో పాటు రైతు భరోసా నిధులను కూడా రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని 21 వేల మంది రైతుల ఖాతాల్లో రూ.14 కోట్ల రైతు భరోసా నిధులు జమ అయ్యాయని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పీసీసీ మాజీ కార్యదర్శి మతీన్, యువరాజ్ మోరే, సాయిలు ముదిరాజ్, అంజయ్య రాజు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆంజనేయస్వామి ఆలయ మహోత్సవంలో జీఎంఆర్..

**పటాన్‌చెరు, జూలై 5 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు మండలంలోని నందిగామ గ్రామంలో గల శ్రీ శ్రీ శ్రీ దాసాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన జీర్ణోద్ధరణ, గణపతి-నవగ్రహ సహిత బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంలో దేవాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. భక్తి, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో ఆలయాల ప్రాధాన్యం ఎంతో ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవరచుకుని సమాజంలో ఐక్యత, సామరస్యాన్ని పెంపొందించాలని కోరారు. దేవాలయాల అభివృద్ధి, జీర్ణోద్ధరణ పనులకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, గోపాల్, లక్ష్మణ్, దేవేందర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ శిబిరం

- **క్యాన్సర్ పై అవగాహన పెరగాలి**
- **ఎంపీ రఘునందన్ సహకారంతో**

**నర్సాపూర్ జూలై 5 (సిరి న్యూస్)**

మహిళలకు ఎక్కువగా గర్భసంచి క్యాన్సర్ వస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు అవగాహన కల్పించాలని ప్రథమ దశలోనే తెలుసుకోవాలి ఉద్దేశంతో మెదక్ ఎంపీ రఘునందన్ సహకారంతో శిశిర ఆస్పటల్ వారి సౌజన్యంతో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఉచిత గర్భాదయ క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టింగ్ సెంటర్ ను శిబిరంను ఎంపీ ప్రారంభించారు స్కానింగ్ మహిళలు ఆసుపత్రికి వచ్చారు డాక్టర్ సింధు మాధవనేని స్కానింగ్ నిర్వహించి వారికి తగిన సూచనలు సలహాలు ఇచ్చింది ఎంపీ రఘు నందన్ మాట్లాడుతూ మహిళలు ప్రాంత మహిళలు తప్పనిసరిగా క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలని ముందస్తు నివారణ ద్వారా క్యాన్సర్ అదుపు చేయవచ్చని గ్రామీణ ప్రాంతాలలో నివాసముంటున్న మహిళలకు క్యాన్సర్ పై అవగాహన లేక క్యాన్సర్ అంటే బూతంల చూస్తున్నారు క్యాన్సర్ పరీక్షలో క్యాన్సర్ వచ్చింది అంటే భయంకి గురవుతున్నారని క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడానికి ముందుకు రాని పరిస్థితులలో ఎం పీ గా గెలిచినందుకు నా కూతురు గైనకాలజీ డాక్టర్ సింధుతో మా అల్లుడుతో ప్రజలకు సేవలు అందించాలని ఉద్దేశంతో ఆదివారం మున్సిపాలిటీ, మండల కేంద్రాలలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్ శిబిరంను ఏర్పాటు చేస్తాము అన్నారు కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్ కౌన్సిలర్లు బిజెపి మండల అధ్యక్షులు నగేష్ తదితరులు పాల్గొన్నారు



# ప్రభుత్వ వాటర్ ఫిల్టర్ ప్లాంట్ కు మోక్షం ఎప్పుడో ?

- **స్థలం ఉన్నా ముందుకు రాని పాలకవర్గం..**
- **ప్రైవేట్ ప్లాంట్ల ఇష్టారాజ్యం..**
- **జగదేవపూర్ లో శుద్ధి నీటి కోసం ప్రజల ఎదురుచూపులు**
- **కలుషిత నీరుతో అనారోగ్య సమస్యలు**

**గజ్వేల్ జులై 05 (సిరి న్యూస్ )**







గజ్వేల్ నియోజకవర్గంలో మేజర్ గ్రామపంచాయతీగా గుర్తింపు పొందిన జగదేవ్‌పూర్‌లో ప్రాథమిక అవసరమైన శుద్ధి చేసిన తాగునీటి సమస్య ఇంకా పరిష్కారం కాకపోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గ్రామానికి ప్రభుత్వ వాటర్ ఫిల్టర్ ప్లాంట్ అత్యవసరం ఉన్నప్పటికీ, ఇప్పటివరకు అది ఏర్పాటు కాకపోవడం స్థానికుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది.
గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ వాటర్ ఫిల్టర్ ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ, పాలకవర్గం మరియు ప్రజాప్రతినిధులు ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఎటువంటి పురోగతి కనిపించకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోంది.
ప్రస్తుతం జగదేవ్‌పూర్‌లో వేలాది మంది ప్రజలు తాగునీటి కోసం పూర్తిగా ప్రైవేట్ వాటర్ ప్లాంట్లపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో సరసమైన ధరలకు నీరు అందించే సౌకర్యం లేకపోవడంతో, ప్రైవేట్ ప్లాంట్ల నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా ధరలు నిర్ణయిస్తూ ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాధారణ కుటుంబాలకు ఇది భారంగా మారుతుండగా, రోజువారీ ఆదాయం తక్కువగా ఉన్నవారికి ఇది మరింత కష్టంగా మారుతోంది.
మరోవైపు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు తప్పనిసరిగా కలుషిత నీటినే వినియోగించాల్సి వస్తోంది. దీనివల్ల జ్వరం, కడుపునొప్పి, డయేరియా, వైరల్ వ్యాధులు వంటి నీటి ద్వారా వ్యాపించే అనారోగ్య సమస్యలు గ్రామంలో పెరుగుతున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీలు మరియు వృద్ధులు ఈ సమస్యలకు ఎక్కువగా గురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
గ్రామ ప్రజలు చెబుతున్న వివరాల ప్రకారం, శుద్ధి చేసిన నీరు అందుబాటులో లేకపోవడం వల్ల కుటుంబాల ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం పడుతోందని పేర్కొంటున్నారు. తాగునీటి సమస్య కారణంగా వైద్య ఖర్చులు కూడా పెరుగుతున్నాయని, ఇది పేద కుటుంబాలకు మరింత భారంగా మారుతోందని అంటున్నారు.
ప్రభుత్వం "ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు" అనే లక్ష్యంతో పలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, మేజర్ గ్రామపంచాయతీ అయిన జగదేవ్‌పూర్‌లో మాత్రం ఈ ప్రాథమిక అవసరం ఇంకా నెరవేరకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్య ధోరణి కారణంగా ఈ సమస్య సంవత్సరాలుగా అలాగే కొనసాగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఇప్పటికే అందుబాటులో ఉన్న స్థలంలో ప్రభుత్వ వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌ను త్వరితగతిన ఏర్పాటు చేసి, గ్రామ ప్రజలకు తక్కువ ఖర్చుతో శుద్ధి చేసిన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## నందిగామలో ఆంజనేయస్వామి మహోత్సవంలో కాట సుధా శ్రీనివాస్ గౌడ్..



**పటాన్‌చెరు, జూలై 5 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీ ఆంజనేయ స్వామి పునఃశ్చరణ, గణపతి-నవగ్రహ సహిత బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆమె స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ మహోత్సవంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



## సిద్దిపేటలో 15 రోజుల పాటు సిటీ పోలీస్ యాక్ట్ అమలు

- **కమిషనరేట్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి**
- **సీపీ ఎస్. రష్మీ పెరుమాళ్**

**సిద్దిపేట( జులై 5), (సిరి న్యూస్ )**

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో జూలై 7, 2026 ఉదయం 6 గంటల నుంచి జూలై 22, 2026 ఉదయం 6 గంటల వరకు సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ ఒక ప్రకటనలో తెలిపారు .ఈ కాలంలో కమిషనరేట్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే సంబంధిత ఏసీపీ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. బంద్ పేరుతో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వ్యాపార సంస్థలను బలవంతంగా మూసివేయాలని ఒత్తిడి చేయడం లేదా బెదిరించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
అలాగే జూలై 7 నుంచి జూలై 22 వరకు కమిషనరేట్ పరిధిలో భారీ శబ్దాలతో డీజే సౌండ్ వినియోగంపై కూడా నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు, రోగులు, విద్యార్థులకు శబ్ద కాలుష్యం వల్ల ఇబ్బందులు కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.మైక్ సెట్ వినియోగం అవసరమైతే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు లేదా ఇతర అధిక శబ్ద పరికరాలు వినియోగించిన వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ ఎస్. రష్మీ పెరుమాళ్ తెలిపారు.





## అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న సునీత రెడ్డి

**వెల్దుర్తి,జులై 05, (సిరి న్యూస్ ):**

ఆదివారం వెల్దుర్తి మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి
వెల్దుర్తి మండలం ఉప్పు లింగాపూర్ గ్రామంలో 10 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న మహిళా సమైక్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సునీత రెడ్డి అనంతరం రామయపల్లి గ్రామంలో 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు నాణ్యమైన పాలన అందించాలని పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే రామయపల్లి గ్రామంలో కూడా పది లక్షల వ్యయంతో మహిళా సమైక్య భవనానికి శంకుస్థాపన చేసి ఆమ్లెట్ గ్రామం కొత్తపల్లి గ్రామంలో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది..
ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, నాయకులు మోహన్ రెడ్డి కృష్ణ గౌడ్, ప్రతాప్ రెడ్డి, రామాయపల్లి గ్రామ సర్పంచ్ పావని మహేందర్, రమేష్ చందర్ గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, వెల్దుర్తి మండల సీనియర్ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు సర్పంచులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది..

# ఓటరు జాబితా ప్రక్షాళనకు ఎస్ఐఆర్ ప్రక్రియ

- **అర్హులకే ఓటు హక్కు కల్పించడమే ప్రధాన లక్ష్యం**
- **ఒకే వ్యక్తికి ఒకే చోట ఓటు నమోదు ఉండేలా ప్రత్యేక సవరణ**

**గుమ్మడిదల (సిరి న్యూస్):**


ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను చేపట్టింది. ఈ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాలో ఉన్న వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన ఓటర్ల వివరాలను ధ్రువీకరించడంతో పాటు అనర్హుల పేర్లను తొలగించడం, అవసరమైన మార్పులు, చేర్పులు చేపట్టడం జరుగుతుంది. ప్రస్తుతం బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఓటరు తన వ్యక్తిగత వివరాలు, చిరునామా, కుటుంబ వివరాలు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో ఫారాన్ని పూర్తిచేసి నిర్ణీత గడువులోగా బీఎల్‌వోకు అందజేయాల్సి ఉంటుంది. అనంతరం ఎన్నికల అధికారులు వాటిని పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

**ఒకే వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు**

ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రధాన ఉద్దేశం ఒకే వ్యక్తికి దేశంలో ఒకే ప్రాంతంలో మాత్రమే ఓటు హక్కు ఉండేలా చూడటమే. గతంలో నివాసం మారినా పాత ప్రాంతంలో ఓటు కొనసాగిస్తూ, కొత్త ప్రాంతంలో కూడా ఓటు నమోదు చేసుకున్న వారి వివరాలను గుర్తించి సరిచేసేందుకు ఈ ప్రత్యేక సవరణ ఉపయోగపడుతుంది. అలాగే మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, ఇతర వివరాల సవరణ కూడా ఈ ప్రక్రియలో భాగంగా చేపడతారు. ఎన్నికల సమయంలో పారదర్శకతను పెంచడంతో పాటు నిజమైన అర్హులకే ఓటు హక్కు కల్పించడం, నకిలీ లేదా ద్వంద్వ నమోదులను నివారించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.

**సకాలంలో ఫారం సమర్పించాలని సూచన**

ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావాలంటే ప్రతి ఓటరు ఫారాన్ని సక్రమంగా నింపి నిర్ణీత గడువులోగా బీఎల్‌వోకు అందజేయడం అత్యంత కీలకమని అధికారులు సూచిస్తున్నారు. ఫారంలో నమోదు చేసే వివరాలు స్పష్టంగా, సరైన ఆధార పత్రాలతో ఉండాలని, సందేహాలు ఉంటే బీఎల్‌వోలను లేదా సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలని పేర్కొంటున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు ఈ ప్రక్రియపై పూర్తి సమాచారం అందించాలని ప్రజలు కోరుతున్నారు. సరైన అవగాహనతో ప్రతి అర్హత కలిగిన ఓటరు తన వివరాలను ధ్రువీకరించుకుంటే ఓటరు జాబితా మరింత విశ్వసనీయంగా, పారదర్శకంగా రూపుదిద్దుకుంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.







# గుంతల రోడ్లు - ప్రయాణికుల పాట్లు

# దారికొచ్చేదెప్పుడు..?

**వెల్దుర్తి, జూలై 05,( సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండలంలోని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడ్డ ఎలుకపల్లి గ్రామం మీదుగా యశ్వంతరావుపేట్ మంగళపర్తి గ్రామానికి అనుసంధానం గల ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిగా దెబ్బతింది, ఈ రోడ్డుని పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని, దశాబ్ద కాలం నాడు ఈ రోడ్డును వేశారని ఇప్పుడు పూర్తిగా అద్వాన్నంగా మారిందని , అప్పటినుండి ఇప్పటివరకు ఈ రోడ్డును పట్టించుకునే వారేలేరని స్థానికులు చెబుతున్నారు, గత ప్రభుత్వం, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం, కూడా పట్టించుకోవటం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడి ఎన్నో ప్రమాదాలు జరిగాయని, ప్రమాదాలు జరిగినా కూడా ఇటువైపు కన్నెత్తి చూడని అధికారులు ఉన్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వెల్దుర్తి మండల కేంద్రానికి ప్రక్కన గల ఈ గ్రామం అభివృద్ధికి నోచుకోకపోవడం దురదృష్టమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గ్రామం, ఉండడంతో అధికారులు ఇటువైపు వచ్చేవారే కరువయ్యారని చెబుతున్నారు, వెంటనే అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని మూడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





## ఫార్మా సిటీ–ఫ్యూచర్ సిటీ భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ సభ

- **భూములు కోల్పోమని రైతుల స్పష్టం.. అక్రమాలపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తామని జ్యూరీ సభ్యుల హామీ**

**తాటిపర్తి, జూలై 5, (సిరిన్యూస్):**

ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల కోసం చేపడుతున్న భూసేకరణ ప్రక్రియపై తెలంగాణ ప్రజా జాయింట్ యాక్షన్ కమిటీ (TPJAC) ఆధ్వర్యంలో ఆదివారం తాటిపర్తి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించారు. నాలుగు గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో హాజరై భూసేకరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఈ కార్యక్రమానికి సీనియర్ అడ్వకేట్ వి. రఘునాథ్, మానవ హక్కుల వేదిక జాతీయ కమిటీ సభ్యుడు ఎస్. జీవన్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ వి. వసంత లక్ష్మి, ప్రొఫెసర్లు సుజాత సురేపల్లి, విజయ్, రిటైర్డ్ తహసీల్దార్ వి. బాలరాజ్ జ్యూరీ సభ్యులుగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని TPJAC కోకన్వీనర్ కన్నెగంటి రవి నిర్వహించారు. సభలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ, భూసేకరణ ప్రక్రియలో అక్రమాలు, ఒత్తిళ్లు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తమకు ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులు అవసరం లేదని, తమ వ్యవసాయ భూములే కావాలని ముక్తకంఠంతో అభిప్రాయం వ్యక్తం చేశారు. వ్యవసాయ భూములు తమ జీవనాధారమని, వాటిని కోల్పోతే జీవనం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. జ్యూరీ సభ్యులు మాట్లాడుతూ, ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలు, భూసేకరణకు సంబంధించిన అంశాలపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ప్రజల గొంతును సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాలుగు గ్రామాల సర్పంచులు నీలం శ్రీవిద్య, నీలం ఝాన్సీ, సంగం చైతన్య, ఫార్మా వ్యతిరేక కమిటీ సభ్యులు కానేమోని గణేష్, సందీప్, కొండల్ రెడ్డి, సమ నిరంజన్, అచ్చిరెడ్డి, కుందారపు నారాయణ, చెన్నయ్య, దేవోజీ, వినోద్ రెడ్డి, సోమయ్య, అనంత్ రెడ్డితో పాటు నాలుగు గ్రామాలకు చెందిన రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

## కన్నెపల్లి పంప్ హౌస్ సందర్శన అనంతరం కేటీఆర్ ప్రెస్ మీట్

**(సిరిన్యూస్)**

కాళేశ్వరం పంప్‌హౌస్‌ల నుంచి వెంటనే నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ నీటిని ఎత్తిపోయకపోతే దాదాపు 50 వేల మంది రైతులతో కలిసి కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఒకవైపు రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులు, మరోవైపు ఎల్‌నినో ప్రభావం రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఇంతటి కరువు పరిస్థితుల్లో కూడా లక్షల క్యూసెక్కుల గోదావరి నీరు సముద్రంలో కలిసిపోతున్నా, రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతుల కోసం ప్రధాన ప్రతిపక్షంగా కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు వస్తుంటే తమను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకోవడం ప్రజలందరూ చూశారని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యల కోసం వస్తున్న తమపై ఇంతటి పోలీసు నిర్బంధం ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. "రైతుల కోసం మేము వస్తే రేవంత్ రెడ్డికి ఎందుకు అంత భయం?" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీశారు.



## ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం.. దొంగతనం.. వృద్ధురాలిని బావిలోకి తోసేసిన డిగ్రీ విద్యార్థి అరెస్ట్

- **రూ.4 లక్షలు నష్టపోయిన యువకుడు.. లోన్ యాప్ ఒత్తిడితో దారుణానికి పాల్పడినట్లు పోలీసుల వెల్లడి**

**జగిత్యాల/కరీంనగర్, జూలై 6, (సిరిన్యూస్):**

ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌ల వ్యసనం ఓ డిగ్రీ విద్యార్థిని దారుణ నేరానికి పురిగొల్పిన ఘటన జగిత్యాల జిల్లాలో వెలుగుచూసింది. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గుల్లపేట గ్రామానికి చెందిన దమ్మ దినేష్ రెడ్డి (21) అనే యువకుడు, అప్పుల ఒత్తిడితో ఓ వృద్ధురాలిని దోచుకుని అనంతరం బావిలోకి తోసేసిన కేసును పోలీసులు ఛేదించారు.

పోలీసుల వివరాల ప్రకారం, దినేష్ రెడ్డి ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు బానిసై సుమారు రూ.4 లక్షలు నష్టపోయాడు. డబ్బు అవసరంతో లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోగా, వాటిని చెల్లించాలని నిర్వాహకులు తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగతనానికి పథకం రచించాడు.

ఈ నెల 1వ తేదీన కూలి పనుల కోసం లేబర్ అడ్డా వద్ద వేచి ఉన్న గంగాధర లక్ష్మి అనే వృద్ధురాలిని గమనించిన నిందితుడు, పని ఇప్పిస్తానని నమ్మించి నసుల్తాపూర్ శివారుకు తీసుకెళ్లాడు. అక్కడ ఆమె వద్ద ఉన్న అర తులం బంగారం, 20 గ్రాముల వెండి ఆభరణాలను లాక్కొని, విషయం బయటకు రాకుండా ఉండేందుకు ఆమెను సమీపంలోని బావిలోకి తోసేసి అక్కడి నుంచి పరారయ్యాడు.

అయితే తీవ్ర గాయాలతోనూ వృద్ధురాలు ప్రాణాలతో బయటపడింది. దాదాపు 21 గంటల పాటు బావిలోనే చిక్కుకుపోయిన ఆమెను మరుసటి రోజు ఉదయం స్థానిక గ్రామస్తులు గమనించి బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఆమెను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. సంఘటన ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలు, నిందితుడు ఉపయోగించిన ర్యాపిడో బుకింగ్ వివరాలు, మొబైల్ ఫోన్ నంబర్ ఆధారంగా కరీంనగర్ అమరవీరుల స్తూపం వద్ద దినేష్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

విచారణలో నిందితుడు దోచుకున్న బంగారాన్ని కరీంనగర్ టవర్ సర్కిల్ ప్రాంతానికి చెందిన వేణు మనోహరాచారి అనే బంగారం వ్యాపారికి విక్రయించి రూ.30 వేల నగదు తీసుకున్నట్లు అంగీకరించాడు. ఈ నేపథ్యంలో నిందితుడితో పాటు బంగారం కొనుగోలు చేసిన వ్యాపారిని కూడా పోలీసులు అరెస్టు చేసి, కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## లక్ష్మీపురం ప్లాట్ల సమస్య పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే జీఎంఆర్..

**రామచంద్రపురం, జూలై 5 (సిరి న్యూస్):**

కొల్లూరు లక్ష్మీపురం ప్లాట్ల యజమానుల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం కొల్లూరులో లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1984లో ప్లాట్లు కొనుగోలు చేసిన పలువురు ఉద్యోగులు ప్రస్తుతం వివాదాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపించి, అవసరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులతో చర్చిస్తామని తెలిపారు. అవసరమైతే సంబంధిత అనుమతుల అంశాన్ని కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.



ప్రతి ప్లాట్ యజమానికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని, సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తమ సహకారం కొనసాగుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



## ఆలయాల వైభవాన్ని పునరుద్ధరిస్తాం

- **ఎమ్మెల్యే సంపూర్ణ సహకారం**

**అమీన్ పూర్ జులై 5 సిరి న్యూస్**

పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని నూతన దేవాలయ అభివృద్ధికి.. నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం బీరంగూడ డివిజన్ పరిధిలోని లక్ష్మి సాయి మెడోస్ కాలనీ పోచమ్మ దేవాలయం, ఎన్ఎస్ఎల్ కాలనీ వినాయక దేవాలయం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవంతుని కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ప్రమోద్ రెడ్డి, లింగం గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆదిరెడ్డి మోహన్ రెడ్డిని సత్కరించిన లేబర్ సెల్ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి

**కొంపల్లి.జులై.05(సిరి న్యూస్).**

288 కొంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులుగా ఎన్నికైన ఆదిరెడ్డి మోహన్ రెడ్డిని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా లేబర్ సెల్ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో తన కార్యాలయంలో ఆదివారం నాడు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్ తో పాటు జిల్లా లేబర్ సెల్ జాండ్రల్ సెక్రెటరీ ఉపేందర్ రెడ్డి.కుత్బుల్లాపూర్ లేబర్ సెల్ అధ్యక్షులు కావాలి గోపాల్.కుత్బుల్లాపూర్ జాండ్రల్ సెక్రెటరీ తేజ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తనపై నమ్మక్కంతో ఇచ్చిన పదవిని రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరేలా ప్రతి ఒక్కరికి సహకరిస్తూ పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని అన్నారు. తనకు డివిజన్ అధ్యక్షులు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని తెలిపారు.

## లారీ ఢీ..యువకుడి పరిస్థితి విషమం

**నంగునూరు, జులై 5 (సిరిన్యూస్)**

నంగనూరు మండలం పాలమాకుల శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు తీవ్రంగా గాయపడగా,మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన మగ్గిడి నిఖిల్, తాటిపాముల అనిల్ కలిసి మోటార్ సైకిల్ పై వెళుతుండగా,పాలమాకల శివారులో గుర్తు తెలియని లారీ వారిని బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో నిఖిల్ తీవ్రంగా గాయపడగా,అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అనిల్ కు స్వల్ప గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

## కన్నెపల్లి పర్యటనకు వెళ్తున్న మధుసూదనాచారిని అడ్డుకున్న పోలీసులు

**మహాదేవపూర్, జూలై 6, (సిరిన్యూస్):**

కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ K. T. Rama Raoతో కలిసి వెళ్తున్న తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేత S. Madhusudhana Charyను మహాదేవపూర్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు.

కన్నెపల్లి పంప్‌హౌస్‌కు వెళ్లే మార్గంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, వాహనాలను నిలిపివేయడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భద్రతా కారణాల దృష్ట్యా ముందుకు వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు తెలిపినట్లు సమాచారం.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ, ప్రజాప్రతినిధులను ప్రజా ప్రాజెక్టు సందర్శనకు అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితులను పరిశీలించకుండా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు.

# బయటి దొరికే ఫుడ్ ఇప్పుడు ఇంట్లోనే...

వానాకాలంలో చిరుతిళ్లు తినడం బాగా ఎంజాయ్ చేస్తారు. అయితే, అలాగని బయటి ఫుడ్ తింటే ఆరోగ్యం పాడవుతుంది ఎలాగా? అని ఆలోచిస్తుంటారు. అయితే, బయట దొరికే ఫుడ్‌ని ఇలా ఇంట్లోనే ఈజీగా చేసుకోండి.



### ఎగ్ పఫ్ కావాల్సినవి

- గోధుమ పిండి – రెండు కప్పులు
- కోడిగుడ్లు (ఉడికిన) – నాలుగు
- ఉప్పు, నీళ్లు, నూనె – సరిపడా
- వెన్న – మూడు టీస్పూన్లు
- పచ్చిమిర్చి – మూడు
- ఉల్లిగడ్డలు, టొమాటోలు – రెండేసి చొప్పున
- కారం – ఒక టీస్పూన్
- పసుపు – ఒక టీస్పూన్
- ధనియాల పొడి – ఒక టీస్పూన్
- గరం మసాలా – ఒక టీస్పూన్
- అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీస్పూన్

**తయారీ :** ఒక గిన్నెలో గోధుమ పిండి, ఉప్పు, వెన్న వేసి నీళ్లు పోసి కలిపి ముద్ద చేయాలి. దాన్ని చపాతీలా వత్తి, నూనె రాసి నాలుగు వైపులా మడతపెట్టాలి. తర్వాత ఒక గిన్నెలో పెట్టి మూతపెట్టి పక్కనపెట్టాలి. ఒక పాన్‌లో నూనె వేడి చేసి, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, టొమాటో తరుగు, ఉప్పు వేసి వేగించాలి. అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా వేసి కలపాలి. ఆ తర్వాత గిన్నెలో పెట్టిన పిండిని తీసి, ఉండలు చేయాలి. వాటిని చపాతీలా వత్తి, నూనె రాసి నాలుగు వైపులా మడతపెట్టి మరోసారి వత్తాలి. ఇలా మూడు లేదా నాలుగు సార్లు చేశాక, నాలుగు భాగాలుగా కట్ చేయాలి. ఒక్కోదాంట్లో రెడీ చేసిన స్టఫింగ్ దాంతోపాటు సగానికి కోసిన కోడిగుడ్డు పెట్టి మూసేయాలి. ఇడ్లీ ప్లేట్‌కి నూనె రాసి, వాటిని అందులో పెట్టాలి. మరో పాన్‌లో చిన్న గిన్నె బోర్లించి, దానిపై ఇడ్లీ ప్లేట్ పెట్టి మూతపెట్టాలి. కాసేపటి తర్వాత మూత తీసి, వాటిని రెండోవైపు తిప్పి పెట్టాలి. మళ్లీ మూతపెట్టి ఉడికించాలి






### మసాలా కార్న్ టోస్ట్ కావాల్సినవి

- నూనె – రెండు టేబుల్ స్పూన్లు
- వెల్లుల్లి తరుగు – ఒక టేబుల్ స్పూన్
- ఉల్లిగడ్డ తరుగు – ఒక కప్పు
- జీలకర్ర పొడి – అర టీస్పూన్
- పచ్చిమిర్చి – ఒకటి
- కారం – ఒక టీస్పూన్
- గరం మసాలా – పావు టీస్పూన్
- ఫ్రెష్ క్రీమ్ – అర కప్పు
- చీజ్ – అర కప్పు
- కొత్తిమీర – కొంచెం
- వెన్న – ఒక టీస్పూన్
- బ్రెడ్ ముక్కలు – ఆరు

**తయారీ :** పాన్‌లో నూనె వేడి చేసి, వెల్లుల్లి, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి తరుగు, మొక్కజొన్న గింజలు ఒకదాని తర్వాత ఒకటి వేసి వేగించాలి. అందులో కారం, జీలకర్ర పొడి, గరం మసాలా, ఫ్రెష్ క్రీమ్, చీజ్ కూడా ఒక్కోటిగా వేస్తూ కలపాలి. ఆ తర్వాత పాన్‌లో వెన్న వేడి చేసి బ్రెడ్ ముక్కని అందులో పెట్టాలి. దానిపై కార్న్ మిశ్రమం పెట్టి, చీజ్ చల్లి మూతపెట్టి కాసేపు ఉడికించాలి. తర్వాత బ్రెడ్ ముక్కల్ని కట్ చేసి, కొత్తిమీర తరుగు చల్లాలి.





### ఆలూ మటర్ పఫ్ కావాల్సినవి

- గోధుమ పిండి – ఒక కప్పు
- నూనె, ఉప్పు, నీళ్లు – సరిపడా
- వాము – అర టీస్పూన్
- జీలకర్ర – అర టీస్పూన్
- పసుపు – అర టీస్పూన్
- గరం మసాలా – అర టీస్పూన్
- మొలకెత్తిన పచ్చి బటానీ – ఒక కప్పు
- పచ్చిమిర్చి – మూడు
- ఆలుగడ్డ, ఉల్లిగడ్డ – ఒక్కోటి
- అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీస్పూన్
- ధనియాల పొడి – ఒక టీస్పూన్
- నిమ్మరసం – ఒక టీస్పూన్
- కార్న్‌ఫ్లోర్ – నాలుగు టేబుల్ స్పూన్లు

**తయారీ :** ఒక గిన్నెలో గోధుమ పిండి, వాము, నూనె, ఉప్పు వేసి నీళ్లు పోసి కలిపి ముద్ద చేయాలి. మూతపెట్టి పది నిమిషాలు పక్కన పెట్టాలి. మిక్సీజార్‌లో మొలకెత్తిన పచ్చి బటానీ, పచ్చిమిర్చి, ఆలుగడ్డ తరుగు, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. పాన్‌లో నూనె వేడి చేసి, జీలకర్ర, ఉల్లిగడ్డ తరుగు వేసి వేగించాలి. ఆ తర్వాత అందులో ఆలూ బటానీ మిశ్రమం కూడా వేసి కలపాలి. అందులో నీళ్లు పోసి మూత పెట్టి ఉడికించాలి. ఆపై పసుపు, గరం మసాలా, ధనియాల పొడి, నిమ్మరసం, కొత్తిమీర వేసి కలపాలి. ఒక గిన్నెలో కార్న్‌ఫ్లోర్, నూనె వేసి పేస్ట్‌లా కలపాలి. రెడీ చేసిన పిండి ముద్దను ఉండలు చేసి, చపాతీల్లా వత్తాలి. ఒక్కో చపాతీకి ఆ పేస్ట్ పూసి, పిండి చల్లాలి. అలా నాలుగైదు చపాతీలను ఒకదానిపై ఒకటి పేర్చాలి. తర్వాత వాటన్నింటిని రోల్‌లా చుట్టి, రింగులుగా కట్ చేయాలి. వాటిని మరోసారి చపాతీల్లా వత్తి, నాలుగు ముక్కలుగా కట్ చేసి, ఒక్కోదాంట్లో ఆలూ బటానీ స్టఫ్ పెట్టి, మూసేయాలి. అలా చేసిన వాటిని వేడి నూనెలో వేగిస్తే ఆలూ మటర్ పఫ్ రెడీ.





మెంటల్ హెల్త్

# కోపాన్ని కంట్రోల్ చేసుకోవాలంటే...

**కోపంలో ఫ్రస్టేషన్, బాధ, అలగడం, దిగులు వంటివి కూడా ఉంటాయి. కోపం ఎక్స్‌ప్రెస్ చేసే విధానాన్ని బట్టి రిజల్ట్ వస్తుంది. అప్పుడప్పుడు చిరాకు, కోపం, విసుగు వంటివి రావడం సహజమే. మరి దీన్నుంచి బయటపడేదెలా?**

- కోపం వస్తే.... మొదట చేయాల్సిన పని డీప్ బ్రీత్ తీసుకోవడం. కోపం తగ్గేవరకూ నిదానంగా శ్వాస తీసుకుంటూ... వదులుతూ ఉండాలి. తర్వాత మనలో మనం పాజిటివ్‌గా మాట్లాడుకోవాలి.
- కోపం ఎప్పుడు వచ్చినా దాన్ని ఎక్స్‌ప్రెస్ చేయకపోవడమే మంచిది. ఒకవేళ కోప్పడాల్సి వస్తే దాన్ని ఎక్స్‌ప్రెస్ చేసే విధానంలో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఒక్కోసారి చిన్న చిన్నవాటికే ఎక్కువ కోపం చూపిస్తే అవి రిలేషన్‌షిప్ మీద ఎఫెక్ట్ చూపిస్తాయి.
- మీకు సపోర్ట్ చేసే వాళ్లకి మీ ఫీలింగ్స్ గురించి చెప్పండి. కాసేపు వాళ్లతో డిస్కస్ చేయండి. ప్రాబ్లమ్ ఏదైనా కోప్పడకుండా దాన్ని ఎలా సాల్వ్ చేయగలమో అని ఆలోచించాలి.
- ప్రాబ్లమ్ చిన్నదైతే ఎక్కువ రియాక్ట్ అవ్వకుండా ఉండేందుకు ప్రయత్నించాలి.
- నలుగురిలో ఉన్నప్పుడు వీలైనంత వరకూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండాలి.
- కోపాన్ని కంట్రోల్ చేసుకోవాలంటే ముందు ఎదుటి వాళ్లు చెప్పేది వినాలి. ఎందుకంటే వినడం కూడా ఒక కళే, ముందు అది నేర్చుకోవాలి. కమ్యూనికేషన్ పెంచుకోవాలి.

ఇద్దరు మాట్లాడుకుంటుంటే ఒకరి మీద ఒకరికి నమ్మకం ఉండడం చాలా ఇంపార్టెంట్.

- అసౌకర్యంగా అనిపించే చోటు నుంచి దూరంగా వెళ్లాలి. కాసేపు హాయిగా నేచర్‌ను చూస్తూ వాకింగ్ చేయాలి.
- మీకు నచ్చిన పుస్తకాలు లేదా మోటివేట్ చేసే పుస్తకాలను చదువుకోవాలి. ఈ ప్రాబ్లమ్ మరీ ఎక్కువ ఉంటే ప్రొఫెషనల్ థెరపిస్ట్‌ను కలవడం మంచిది. ఆల్కహాల్ లేదా డ్రగ్స్ వంటి అలవాట్లు ఏవైనా ఉంటే కచ్చితంగా వాటిని మానుకోవాలి.
- కోపం వల్ల రిలేషన్‌షిప్స్ దెబ్బతింటాయి. దానివల్ల హెల్త్ ప్రాబ్లమ్స్ కూడా వస్తాయి. కోపం ఎక్కువ రోజులుంటే బీపీ పెరుగుతుంది. హార్ట్ ప్రాబ్లమ్స్, తలనొప్పి, స్కిన్ డిజార్డర్స్, అరుగుదల సమస్యలు వంటివి వస్తాయి. అంతేకాకుండా ఆల్కహాల్ తాగడం, క్రైమ్ చేయడం, ఇతరులను అవమానించడం వంటివి జరుగుతాయి.

## పచ్చిమిర్చిని ఇలా కూడా వాడొచ్చు!



- పచ్చిమిర్చి కట్ చేసిన తర్వాత కొందరికి చేతులు మండుతాయి. అలాంటప్పుడు చేతులకు పంచదార రుద్దుకుంటే మంచి ఉపశమనం లభిస్తుంది.
- మాంసాన్నివేయించేటప్పుడు అది బంగారు గోధుమ రంగులో మంచి లుక్ రావాలంటే మాంసంపై మిరపకాయ ముక్కలను చల్లితే చాలు.
- పచ్చిమిరపకాయల్ని కాసింత పసుపుతో చేర్చి సీసాలో నిలువ చేస్తే ఎరుపు రంగుకు మారకుండా ఉంటాయి.
- పచ్చిమిర్చి ఎక్కువ రోజులు ఫ్రెష్ ఉండాలంటే మొదట శుభ్రంగా కడిగి, ఆరబెట్టాలి. మిర్చి తొడిమలు తీసి, గాలి చొరబడని డబ్బా అడుగున టిష్యూ పేపర్ వేసి మిర్చిని దానిపై పెట్టాలి. వాటిపైన టిష్యూ పేపర్ వేసి మూత పెట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి. పదిహేను రోజులకొకసారి టిష్యూ పేపర్ మార్చితే రెండు నెలల పాటు పచ్చిమిర్చి

# వెళ్లి ఇండియా పిచ్‌లపై ఆడుకో..

## నువ్వు విదేశాల్లో పనికిరావు.. ■ మాజీ క్రికెటర్ సంచలన వ్యాఖ్యలు



**లండన్/న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ని ప్లేయింగ్ ఎలెవన్ లోకి తీసుకోవడంపై భారత మాజీ క్రికెటర్ క్రిస్ శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మ్యాచ్‌లో బిష్ణోయ్ 4 ఓవర్లలో ఏకంగా 60 పరుగులు సమర్పించుకున్నాడు. ముఖ్యంగా అతను వేసిన 17వ ఓవర్లో ఇంగ్లాండ్ బ్యాటర్ జాకబ్ బెథెల్ చెలరేగి 29 పరుగులు రాబట్టాడు. ఈ ఒక్క ఓవర్ మ్యాచ్ ఫలితాన్ని మార్చేసింది. అంతిమంగా ఇంగ్లాండ్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో టీమ్ మేనేజ్‌మెంట్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నిర్ణయాలపై శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానెల్‌లో ఘాటుగా స్పందించారు. బిష్ణోయ్ వేసిన ఆ 17వ ఓవర్ అత్యంత పేలవంగా సాగిందని, బెథెల్ అతడిని ముక్కలు ముక్కలు చేశాడని శ్రీకాంత్ అన్నారు. ఆ ఓవరే భారత్ చేతుల్లోంచి మ్యాచ్‌ను లాగేసుకుందని విమర్శించారు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ (==) తరఫున బిష్ణోయ్ కనీసం సగం మ్యాచ్‌లు కూడా ఆడలేదని, అలాంటి ఆటగాడిని నేరుగా జట్టులోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ఆటగాళ్ల పాత రికార్డులను చూసి ఎంపిక చేయడం సరికాదని, ప్రస్తుత ఫామ్‌ను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని హితవు పలికారు.

### కుల్దీప్ యాదవ్ ప్రస్తావన..

కుల్దీప్ యాదవ్ ఇటీవల ఆశించిన స్థాయిలో రాణించకపోవడంతో అతడిని ప్లేయింగ్ ఎలెవన్ నుండి తొలగించడం సరైనదేనని శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు. అయితే, బిష్ణోయ్ కంటే కుల్దీప్‌ను కనీసం స్క్వాడ్‌లోనైనా ఉంచి ఉండాల్సిందని పేర్కొన్నారు. ఇంగ్లాండ్ పిచ్‌ల వాతావరణ పరిస్థితులకు ముగ్గురు స్పిన్నర్లు అవసరం లేదని శ్రీకాంత్ స్పష్టం చేశారు. వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ రూపంలో ఇద్దరు స్పిన్నర్లు సరిపోతారని.. బిష్ణోయ్‌కు బదులుగా యువ ఆటగాడు ప్రిన్స్ యాదవ్ కు అవకాశం ఇచ్చి ఉంటే జట్టు సమతుల్యత బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. బిష్ణోయ్ కేవలం భారత పిచ్‌లపైనే ప్రభావం చూపగలడని తేల్చి చెప్పారు.



## స్వియాటెక్, రిబకినాకు చెక్

**లండన్ :** వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ఒకే రోజు రెండు సంచలనాలు. డిఫెండింగ్ చాంప్, టైటిల్ ఫేవరెట్ ఇగా స్వియాటెక్, రెండో సీడ్ ఎలెనా రిబకినా మూడో రౌండ్‌లోనే ఓడి ఇంటిదారి పట్టారు. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఫిలిప్పీన్స్‌కు చెందిన 21 ఏండ్ల యంగ్ సెన్సేషన్ అలెగ్జాండ్రా ఈలా 7-6(9/7), 6-2 తో స్వియాటెక్‌ను ఓడించింది. దాంతో ఒక గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ప్రి క్వార్టర్స్ చేరిన ఫిలిప్పీన్స్ ప్లేయర్‌గా సరికొత్త రికార్డు నెలకొల్పింది. మరో మ్యాచ్‌లో రిబకినా (కజకిస్థాన్) 6-7 (4/7), 1-6తో 25వ సీడ్ ఎలీస్ మర్టెన్స్ (బెల్జియం) చేతిలో ఓడిపోయింది. ఇతర మ్యాచ్‌ల్లో మాడిసన్ కీస్ 3-6, 6-2, 6-3తో అనిసిమోవాను, 13వ సీడ్ పావోలిని (ఇటలీ) 6-1, 6-2తో మరియా సకారి (గ్రీస్)ను ఓడించారు. కాగా గాయం కారణంగా అమెరికా లెజెండ్ సెరెనా విలియమ్స్ తన అక్క వీనస్‌తో డబుల్స్ ఈవెంట్ నుంచి వైదొలిగింది. పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) 6-2, 7-6 (7/4), 6-4తో గిరోన్ (అమెరికా)ను ఓడించి ప్రిక్వార్టర్స్ చేరాడు. ఐదో సీడ్ డి మినార్, లెహెకా, కొబోలి కూడా ముందంజ వేశారు.

# రెండో టీ20 ఓడిపోవడానికి కారణం ఇదే..

- నిజం నిర్భయంగా చెప్పిన ఇషాన్ కిషన్..
- నో-బాల్స్, ఫ్రీ-హిట్‌లే మా ఓటమిని శాసించాయి!



**లండన్:** ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత జట్టు ఓటమి పాలైన తర్వాత, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ జట్టు ప్రదర్శనపై అత్యంత నిజాయితీగా స్పందించారు. మ్యాచ్ అనంతరం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. పవర్‌ప్లేలో భారత్ 65/2 స్కోరుతో బలంగానే కనిపించినప్పటికీ, ఆ తర్వాత మిడిల్ ఓవర్లలో పరుగులు రాబట్టడంలో తడబడిందని అంగీకరించారు. ముఖ్యంగా 7 నుండి 10 ఓవర్ల మధ్య కేవలం 32 పరుగులు మాత్రమే వచ్చాయని, అలాగే డెత్ ఓవర్లకు ముందు 14-17 ఓవర్ల వ్యవధిలో కేవలం 23 పరుగులే సాధించగలిగామని కిషన్ వివరించారు. ఈ కీలక సమయాల్లో ఇంకొన్ని పరుగులు రాబట్టాల్సి ఉన్నప్పటికీ, పిచ్ పరిస్థితుల కారణంగా అది సాధ్యపడలేదని ఆయన పేర్కొన్నారు. భారత్ నిర్దేశించిన 191 పరుగుల భారీ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ జట్టు మరో ఓవర్ మిగిలి ఉండగానే అలవోకగా ఛేదించింది. అయితే, ఇన్నింగ్స్ 17వ ఓవర్ మ్యాచ్‌ను పూర్తిగా మలుపు తిప్పిందని ఇషాన్ కిషన్ స్పష్టం చేశారు. స్పిన్నర్ రవి బిష్ణోయ్ వేసిన ఆ ఓవర్లో రెండు నో-బాల్స్ పడటం, వాటి వల్ల వచ్చిన ఫ్రీ-హిట్‌లు ఇంగ్లాండ్ బ్యాటర్ జాకబ్ బెథెల్ (76 నాటౌట్) పై ఉన్న ఒత్తిడిని పూర్తిగా తగ్గించాయని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ టీ20ల్లో ఎలాంటి శ్రమ లేకుండా ప్రత్యర్థికి అదనంగా 12 పరుగులు సమర్పించుకోవడం భారీ నష్టాన్ని కలిగిస్తుందని, ఆ ఒక్క ఓవర్ మాత్రమే తమ ఓటమిని పూర్తిగా శాసించిందని కిషన్ విశ్లేషించారు.

### నంబర్ వన్ ర్యాంకింగ్‌పై స్పందన..

ఇటీవలే ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకోవడంపై ఇషాన్ కిషన్ సంతోషం వ్యక్తం చేశారు. కేవలం ఫలితాల గురించి మాత్రమే ఆలోచించకుండా, ప్రతిరోజూ తన బ్యాటింగ్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టడం వల్లనే ఈ మైలురాయిని అందుకోగలిగానని అన్నారు. వరుస ఓటములు జట్టుపై మానసికంగా కొంత ప్రభావం చూపుతాయనేది నిజమేనని, అయితే జట్టులోని ఆటగాళ్లంతా అంతర్జాతీయ స్థాయిలో ఎంతో పరిణతి చెందిన వారు కాబట్టి, తదుపరి మ్యాచ్‌ల్లో అందరం కలిసికట్టుగా పుంజుకుంటామని పూర్తి ధీమా వ్యక్తం చేశారు.

### వైభవ్ సూర్యవంశీపై ప్రశంసలు..

క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న రికార్డును బద్దలు కొడుతూ, కేవలం 15 ఏళ్ల 99 రోజుల వయసులోనే భారత్ తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని ఇషాన్ కిషన్ ప్రత్యేకంగా అభినందించారు. వైభవ్ అసాధారణమైన ప్రతిభావంతుడని కొనియాడారు. జట్టులోని సీనియర్ ఆటగాళ్లుగా అతనికి పూర్తి అండగా ఉంటూ, ఒత్తిడి లేని వాతావరణాన్ని కల్పించి, అతని సహజసిద్ధమైన ప్రత్యేక ఆటతీరును కాపాడటం తమ అందరి బాధ్యత అని ఇషాన్ కిషన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# మళ్లీ బాబర్‌కే పగ్గాలు..!

## కెప్టెన్ మార్పుతో పాక్‌లో గందరగోళం

## షాన్ మసూద్‌పై వేటు వేసిన పీసీబీ

## వెస్టిండీస్ పర్యటనతో బాబర్‌కు తొలి పరీక్ష

**లాహోర్:** పాకిస్థాన్ టెస్టు జట్టు కెప్టెన్సీలో మరోసారి కీలక మార్పు చోటుచేసుకుంది. వరుస వైఫల్యాల నేపథ్యంలో కెప్టెన్ షాన్ మసూద్‌ను తప్పించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ), స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్‌ను మళ్లీ టెస్టు జట్టు సారథిగా నియమించింది. తరచూ కెప్టెన్సీ మార్పులు చేస్తుండటం పాకిస్థాన్ జట్టులో నాయకత్వ సంక్షోభానికి నిదర్శనంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు మూడేళ్లుగా టెస్టు జట్టుకు నాయకత్వం వహించిన షాన్ మసూద్ తన హయాంలో జట్టును విజయాల బాట పట్టించలేకపోయాడు. అతని కెప్టెన్సీలో పాకిస్థాన్ ఆడిన 16 టెస్టుల్లో 12 మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. ఈ పేలవ ప్రదర్శన నేపథ్యంలో పీసీబీ మరోసారి బాబర్ ఆజమ్ వైపు మొగ్గు చూపింది. కెప్టెన్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టిన బాబర్ ఆజమ్‌కు తొలి సవాలు వెస్టిండీస్ పర్యటన కానుంది. ఈ పర్యటనలో పాకిస్థాన్ రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. తొలి టెస్టు జూలై 25 నుంచి తారౌబాలో, రెండో టెస్టు ఆగస్టు 2 నుంచి పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో జరగనుంది. ఈ సిరీస్‌తో పాకిస్థాన్ జట్టు తిరిగి విజయాల బాట పట్టాలని బోర్డు ఆశిస్తోంది. కెప్టెన్సీ మార్పుపై పాకిస్థాన్ హై పర్‌ఫార్మెన్స్ డైరెక్టర్ ఆకిబ్ జావేద్ మాట్లాడుతూ.. జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గెలవాల్సిన మ్యాచ్‌లను కూడా చేజార్చుకోవడం, కీలక దశల్లో నాయకత్వ లోపాలు స్పష్టంగా కనిపించాయని పేర్కొన్నారు. ముఖ్యంగా దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌తో జరిగిన టెస్టుల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయామని, మ్యాచ్‌ను విజయవంతంగా ముగించడం కెప్టెన్ బాధ్యతేనని ఆయన వ్యాఖ్యానించారు.

### వెస్టిండీస్ పర్యటనకు పాకిస్థాన్ టెస్టు జట్టు

బాబర్ ఆజమ్ (కెప్టెన్), అమీర్ జమాల్, అబ్దుల్లా ఫజల్, అలీ ఉస్మాన్, అజాన్ అవైస్, ఇమామ్ ఉల్ హక్, ఖుర్రమ్ షాజాద్, మహ్మద్ అబ్బాస్, మహ్మద్ అలీ, మహ్మద్ రిజ్వాన్, మహ్మద్ అవైస్ జఫర్, ముహమ్మద్ ఘాజీ ఘోరీ, సాజిద్ ఖాన్, సల్మాన్ అలీ ఆఘా, షాన్ మసూద్, ఉబైద్ షా.



# మెస్సీని వదలని ఎంబాపే

## ఆసక్తిరేపుతున్న గోల్డెన్ బూట్ రేసు..!



అమెరికా, కెనడా, మెక్సికో సంయక్తంగా ఆతిథ్యమిస్తున్న ఫిఫా వరల్డ్‌కప్ 2026లో 'గోల్డెన్ బూట్' రేసు ఆసక్తి రేపుతోంది. అర్జెంటీనా కెప్టెన్ లియోనల్ మెస్సీ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. కిలియన్ ఎంబాపే 'నేను ఉన్నానంటూ' దూసుకొచ్చాడు. శనివారం వరకూ మెస్సీ ఏడు గోల్స్‌తో టాప్‌లో ఉండగా ఎంబాపే సైతం అతడి సరసన చేరాడు. గోల్డెన్ బూట్ కోసం ఈసారి కూడా గట్టిపోటీ నెలకొంది. 16వ రౌండ్‌లో పరాగ్వేపై పెనాల్టీని గోల్‌గా మలిచిన ఎంబాపే, మెస్సీతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. నాకౌట్‌లో అర్జెంటీనా, ఫ్రాన్స్ మరిన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశమున్నందున గోల్డెన్ బూట్ కోసం మెస్సీ, ఎంబాపేల మధ్యే పోటీ ఉండనుంది. సాకర్ వరల్డ్‌కప్‌లో అత్యధిక గోల్స్ వీరుడిని గోల్డెన్ బూట్‌తో సత్కరించడం ఆనవాయితీ. ఈసారి ఈ బూట్ కోసం దిగ్గజం లియోనల్ మెస్సీకి, కిలియన్ ఎంబాపే నుంచి తీవ్రమైన పోటీ ఎదురవుతోంది. గత ఎడిషన్‌లో(2022) గోల్డెన్ బూట్‌ను తన్నుకుపోయిన ఎంబాపే ఈ దఫా రేసులోనే ఉన్నాడు. క్రిస్టియానో రొనాల్డో(పోర్చుగల్) వెనకబడగా.. ఏడు గోల్స్‌తో మెస్సీతో సరిసమానంగా నిలిచాడీ ఫ్రాన్స్ ఫార్వర్డ్ ఆటగాడు. తొలి మ్యాచ్‌లోనే అల్జీరియాపై హ్యాట్రిక్ గోల్స్ చేసిన అర్జెంటీనా కెప్టెన్.. మొత్తంగా నాలుగు మ్యాచుల్లో ఏడు గోల్స్ సాధించాడు. లెజెండరీ ఆటగాడిగా ఎదుగుతున్న ఎంబాపే సైతం 5 మ్యాచుల్లో ఏడు గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో నిలిచాడు. హ్యారీ కేన్(ఇంగ్లండ్), ఎర్లింగ్ హోలాండ్(నార్వే)లు.. ఐదేసి గోల్స్‌తో సంయుక్తంగా మూడో స్థానంలో కొనసాగుతున్నారు.

# ప్రశ్న రావణ్ అరెస్టులపై రచ్చ

## ప్రకాష్ రాజ్ విమర్శలు.. బండ్ల గణేష్ ఘాటు కౌంటర్



యూట్యూబర్ 'ప్రశ్న రావణ్' అలియాస్ జోసెఫ్ బచలకురి అరెస్టుల వ్యవహారం ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ఆయనపై రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఒక కేసులో కోర్టు బెయిల్ మంజూరు చేసిన వెంటనే మరో కేసులో పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇప్పుడు రాజకీయ, న్యాయ, సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై సినీ నటుడు ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు, వాటికి నిర్మాత బండ్ల గణేష్ ఇచ్చిన ఘాటు స్పందన సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతోంది. ప్రశ్న రావణ్‌పై నమోదైన కేసుల్లో ఆయనకు వరుసగా బెయిళ్లు లభిస్తున్నప్పటికీ, విడుదలైన వెంటనే మరో కేసులో పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారని సమాచారం. ఇటీవల ఎలమంచిలి కోర్టు బెయిల్ మంజూరు చేసిన కొద్ది సేపటికే, ఏలూరు పోలీసులు మరో కేసులో నక్కపల్లి టోల్‌ప్లాజా వద్ద ఆయనను అరెస్ట్ చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ విధంగా వరుస అరెస్టులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ ప్రశ్న రావణ్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ అంశంపై నటుడు ప్రకాష్ రాజ్ సోషల్ మీడియాలో స్పందిస్తూ ప్రభుత్వ తీరును ప్రశ్నించారు. ఒక కేసులో కోర్టు బెయిల్ ఇచ్చిన వెంటనే మరో కేసులో అరెస్ట్ చేయడం న్యాయవ్యవస్థ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అభిప్రాయపడ్డారు. వరుసగా బెయిళ్లు లభిస్తున్నాయంటే కేసుల బలంపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వ్యాఖ్యానించిన ఆయన, ఈ విషయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియాలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలకు నిర్మాత, నటుడు బండ్ల గణేష్ తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఆయన చేసిన పోస్టులో ప్రకాష్ రాజ్‌పై వ్యక్తిగత స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రతి అంశంపై అతిగా స్పందించడం సరికాదని పేర్కొంటూ, "ప్రపంచాన్ని మొత్తం నువ్వే నడిపిస్తున్నట్లు వ్యవహరించకు. ముందు నీ బాధ్యతలు, నీ వ్యక్తిత్వాన్ని ఒకసారి నువ్వే పరిశీలించుకో. అతి ప్రవర్తనతో గౌరవం పెరగదు. అణకువగా ఉండటం కూడా అవసరం" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. బండ్ల గణేష్ చేసిన ఈ పోస్టు కూడా సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతోంది.

### అలా ఎందుకు చేస్తున్నారని అడిగితే

# తట్టుకోలేరు..

## బాలీవుడ్ బండారం బయటపెట్టిన కృతి సనన్!

బాలీవుడ్ ఇండస్ట్రీ గ్లామర్ వెనుక దాగున్న జెండర్ వివక్ష, డబుల్ స్టాండర్డ్స్‌పై నేషనల్ అవార్డ్ విన్నింగ్ బ్యూటీ, స్టార్ హీరోయిన్ కృతి సనన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇండస్ట్రీలో ఇప్పటికీ హీరోయిన్లను చాలా తేలికగా తీసుకుంటారని, సెట్స్‌లో వారిని తక్కువ చేసి చూసే ధోరణి ఇంకా కొనసాగుతోందని ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక ఇంటర్వ్యూలో కృతి మాట్లాడుతూ.. తాను కెరీర్‌లో ఎదుర్కొన్న చేదు అనుభవాలను, షూటింగ్ స్పాట్‌లో ఎదుర్కొన్న వివక్షను ధైర్యంగా బయటపెట్టారు. సెట్స్‌లో ఉండే అసిస్టెంట్ డైరెక్టర్ల ప్రవర్తనను కృతి తప్పుబట్టారు. "అసిస్టెంట్ డైరెక్టర్లకు హీరోల టైమింగ్స్ అంటే కాస్త భయం ఉంటుంది. అందుకే హీరోలు ఇంకా రెడీ కాకపోయినా పర్లేదు కానీ, హీరోయిన్లను మాత్రం ముందే పిలిచి సెట్స్‌లో కూర్చోబెడతారు. ఫీమేల్ యాక్టర్స్ టైమింగ్‌ను వాళ్లు చాలా లైట్‌గా తీసుకుంటారు" అంటూ కృతి సనన్ కుండబద్దలు కొట్టారు. అలాగే సినిమాలోని సీన్స్ లేదా క్యారెక్టర్ గురించి హీరోయిన్లు ఏవైనా డౌట్స్ అడిగితే సెట్స్‌లో చూసే కోణమే వేరుగా ఉంటుందని కృతి సనన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక ఫీమేల్ యాక్టర్ ప్రశ్నలు అడిగితే.. 'అబ్బా.. ఈమె మళ్లీ ప్రశ్నలు మొదలుపెట్టింది, ఎన్ని అడుగుతుంది' అన్నట్లుగా గుసగుసలు వినపడతాయి. ఇది నా విషయంలో కూడా జరిగింది. నేను ఏవైనా డౌట్స్ అడిగితే.. 'మరీ అంతగా ఓవర్ అనలైజ్ చేయకు' అని అనేవాళ్లు. అదే ప్రశ్నను పక్కనున్న మేల్ స్టార్ (హీరో) అడిగితే మాత్రం.. 'వావ్.. అతను సినిమాలో చాలా ఇన్వాల్వ్ అవుతున్నాడు.. ఓకే అతను చెప్పింది చేద్దాం' అంటూ ప్రశంసిస్తారు. నేను చెప్పిన పాయింట్‌నే హీరో చెప్తే వెంటనే ఒప్పుకుంటారు" అని కృతి పేర్కొన్నారు. షూటింగ్ లొకేషన్లలో హీరో, హీరోయిన్లకు ఇచ్చే వసతుల్లోనూ స్పష్టమైన తేడాలు ఉంటాయని కృతి సనన్ స్పష్టం చేశారు. ఇక్కడ సమస్య లగ్జరీ వసతుల గురించి కాదని.. ఆత్మగౌరవానిది అని ఆమె చెప్పారు. సినిమా సెట్స్‌పై కృతి సనన్ చేసిన ఈ బోల్డ్ అండ్ షాకింగ్ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.





# 'రామాయణం'లో నా పాత్ర చిన్నదే..

### కానీ చిరస్థాయిగా గుర్తుంటుంది!

## మండోదరిగా నటించడం అదృష్టమన్న కాజల్ అగర్వాల్


భారతీయ సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణం' చిత్రంలో తాను పోషిస్తున్న మండోదరి పాత్ర చిన్నదే అయినప్పటికీ, జీవితాంతం గుర్తుండిపోయే పాత్రగా నిలుస్తుందని నటి కాజల్ అగర్వాల్ అన్నారు. నితేష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా, యష్ రావణుడిగా నటిస్తుండగా, కాజల్ మండోదరి పాత్రను పోషిస్తున్నారు. ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో కాజల్ మాట్లాడుతూ.. తొలి భాగం చిత్రీకరణ పూర్తయిందని, ఇందులో లంక ఘట్టం పరిమితంగా ఉండటంతో తన స్క్రీన్ టైమ్ కూడా తక్కువేనని చెప్పారు. అయినప్పటికీ భారతీయ సంస్కృతి, ఇతిహాసాలకు ప్రతీకగా నిలిచే ఇలాంటి మహత్తర చిత్రంలో భాగమవడం తన కెరీర్‌లో చిరస్మరణీయ ఘట్టమని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన చిత్రబృందానికి ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. రావణుడి పాత్రలో నటిస్తున్న యష్ గురించి కాజల్ ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన అత్యంత అంకితభావం కలిగిన నటుడని, సెట్స్‌లో పూర్తిగా పాత్రలో లీనమై పనిచేస్తారని చెప్పారు. ఆయన ప్రొఫెషనలిజం, నటన మొత్తం చిత్రబృందానికి స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. భారీ వ్యయంతో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. తొలి భాగాన్ని ఈ ఏడాది దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం భావిస్తుండగా, రెండో భాగం వచ్చే ఏడాది విడుదల కానుంది. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన గ్లింప్స్, పోస్టర్లకు విశేష స్పందన లభించింది. ఇక ఈ చిత్ర ట్రైలర్‌ను అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో జూలై 14న జరిగే ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేసే అవకాశముందని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అదే వేదికపై అధికారిక విడుదల తేదీని కూడా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. దీంతో 'రామాయణం' ట్రైలర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సింపుల్‌గా ఆమిర్ ఖాన్ - గౌరీ స్ప్రాట్ వివాహం



## సోషల్ మీడియాలో ఫొటోల చక్కర్లు

బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్, ఆయన సన్నిహితురాలు గౌరీ స్ప్రాట్ వివాహం చేసుకోబోతున్నారంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ముంబైలోని బాంద్రాలో ఉన్న ఆమిర్ ఖాన్ నివాసంలో అత్యంత సన్నిహిత కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో వీరిద్దరి వివాహం చేసుకొని ఒక్కటయ్యారు. ప్రత్యేక వివాహ చట్టం (రాజూవఎఖుశ్రీ మీఖుతీతీఖుస్త్రవ చూష్) ప్రకారం ఆమిర్ ఖాన్, గౌరీ స్ప్రాట్ తమ వివాహాన్ని అధికారికంగా నమోదు చేసుకున్నారని తెలుస్తుంది. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఫొటోల్లో ఆమిర్ ఖాన్ వివాహ పత్రాలపై సంతకం చేస్తున్నట్లు కనిపించగా, ఆయన పక్కనే గౌరీ స్ప్రాట్ సంప్రదాయ దుస్తుల్లో కనిపిస్తున్నారు. ఆమె ధరించిన ఆభరణాలు కూడా నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫొటోలని బట్టి చూస్తుంటే వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నట్లు చెబుతున్నారు. గౌరీ స్ప్రాట్ తన మొదటి వివాహం ద్వారా జన్మించిన కుమారుడితో కలిసి వేడుకకు హాజరైనట్లు, అలాగే ఆమిర్ ఖాన్ కుమారుడు ఆజాద్ రావ్ ఖాన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు వైరల్ అవుతున్నట్టు ఫొటోలని బట్టి తెలుస్తుంది.. ఉంగరాల పెట్టెలతో ఇద్దరు పిల్లలు కనిపించిన దృశ్యాలు రెండు కుటుంబాల కలయికకు ప్రతీకగా సోషల్ మీడియాలో విస్తృతంగా షేర్ అవుతున్నాయి. అయితే, ఈ వివాహానికి సంబంధించిన వార్తలు, ఫొటోలపై ఇప్పటివరకు ఆమిర్ ఖాన్ లేదా గౌరీ స్ప్రాట్ తరఫున ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా, గత మార్చిలో తన 60వ పుట్టినరోజున గౌరీతో పెళ్లి విషయాన్ని ఆమిర్ ఖాన్ అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. జులై 5న ఇంట్లోనే చాలా సింపుల్‌గా పెళ్లి చేసుకుంటున్నాం. ఇరు కుటుంబాలు, కొద్దిమంది స్నేహితులు మాత్రమే హాజరవుతారు అంటూ ఆయన తెలియజేశారు.



ఇక ఇదిలా ఉంటే ఆమిర్ ఖాన్ 1986లో రీనా దత్తాను వివాహం చేసుకుని, 2002లో విడిపోయారు. ఆ తర్వాత 2005లో కిరణ్ రావును పెళ్లి చేసుకుని, 2021లో విడాకులు తీసుకున్నారు. ఇక ఇప్పుడు గౌరీతో వైవాహిక జీవితం కొనసాగించనున్నారు.

**The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.**